ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 18 జూన్ 2024



నెల్లూరు : బారా షహీద్ ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి తదితరులు





బారా షహీద్ ఈద్గాలో బక్రీద్ సందేశాన్ని ఇస్తున్న ఇమామ్ అబూబకర్, ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



బుచ్చి : పెద్ద మసీదులో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రార్థనలు



ఉదయగిరి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అల్లూరు జామియా మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక ఇస్లాం

ఇమాం అబూబకర్ సందేశం

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి హాజరు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 17: త్యాగానికి ప్రతీక ఇస్లాం అని, ముస్లింలు దైవభక్తితోపాటు దేశభక్తికి కూడా ప్రాముఖ్యతను ఇస్తారని ఇమాం అబూబకర్ అన్నారు సోమవారం నెల్లూరు నగరంలోని బారా షహీద్ ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్ పవిత్రతను గురించి వివరించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు. దైవభక్తులయిన ఇబ్రహీం, ఇస్మాయిల్ త్యాగాలను కీర్తించడమేకాకుండా, ప్రపంచంలో మానవులంతా శాంతి,మతసామరస్యంతో మెలగాలని ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేస్తారని ఆయన తెలిపారు. ప్రార్థనలు, నమాజుల అనంతరం ప్రత్యేక దువా నిర్వహించారు. తొలుత నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిలు బారాషహీద్ దర్గాలో జరుగుతున్న ప్రార్థనల్లో పాల్గొని దువా చేశారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగూరు నారాయణరెడ్డి, ఆనం రామనారాయ ణరెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు తదితరులు కూడా వచ్చి ప్రార్థనలు చేశారు. వీరికి టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, దర్గా కమిటీ నాయకులు, ముస్లిం పెద్దలు ఘన స్వాగతం పలికారు. అలాగే నగరంలోని దాదాపు 50కిపైగా మసీదులు, ఈద్గాలలో ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు.



ఆత్మకూరు ఈద్గా మైదానంలో సందేశమిస్తున్న మత గురువు

● ఉదయం నుంచే ప్రార్థనలు

జిల్లాలోని ముస్లింలు సంప్రదాయ దుస్తులు ధరించి సోమవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మసీదులు, ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ప్రత్యేక దువా చేశారు. అనంతరం హిందూ, ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు, బుచ్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాలలో ముస్లింలతో కలిసి ప్రజాప్రతినిధులు ప్రార్థనలు నిర్వహించారు.

మగ్గబెట్టారు..!

● గోదాముల్లో నిన్న బియ్యం.. నేడు కందిపప్పు


● విలువ సుమారు రూ.50 లక్షలు

● అధికారుల నిర్లక్ష్యంతో పాడైపోయిన 26.513 ఎంటీల కందిపప్పు

● 8 నెలలుగా అరకొరగా పేదలకు సరఫరా

రైస్ విషయంలోనూ అదే నిర్లక్ష్యం

ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న అధికారులు... అదే ప్రజాధనాన్ని కాపాడడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో పౌరసరఫరాలశాఖ అధికారుల వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నిన్న బియ్యం.. నేడు కందిపప్పు.. గోదాముల్లో మగ్గిపోయింది. విలువైన ఈ సరుకులను పేదలకు పంపిణీ చేయకుండా గోదాముల్లో కుళ్లపెట్టారు. కొన్నాళ్లకు ఈ సరుకులు పాడైపోతున్నాయి. జరగాల్సిన నష్టం అంతా జరిగాక అప్పుడు పాడైపోయిన కందిపప్పు, బియ్యం వేలం అంటూ హడావిడి చేస్తున్నారు. ఫలితంగా రూ.లక్షల విలువైన ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. తాజాగా జిల్లాలో 26.513 మెట్రిక్ టన్నుల పాడైపోయిన కందిపప్పును వేలం వేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రకటన కూడా జారీ చేశారు.



ఇందుకూరుపేటలోని ఎంఎల్ఎస్ గోదాము

ప్రజా ధనం వృధా

ఏడు గోదాముల్లో దెబ్బతిన్న కందిపప్పు

నెల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు గోదాముల్లో పాడైపోయిన కందిపప్పు నిల్వ ఉంది. చాలాకాలం నుంచి ఈ కందిపప్పు ఆ గోదాముల్లో నిల్వ ఉండడంతో పాడైపోయినట్లు తెలిసింది. మరి ఇంతకాలం నుంచి ఇటు పేదలకు పంపిణీ చేయకుండా, అటు ప్రభుత్వానికి తిరిగి పంపకుండా ఎందుకు గోదాముల్లో మగ్గపెట్టారన్నది ప్రశ్నార్థకంగా మారింది. కోవూరులోని ఎంఎల్ఎస్ పాయింట్లో 5.802 మెట్రిక్ టన్నులు (ఎంటీలు), పొదలకూరులో 12.499, ఇందుకూరుపేటలో 4.322, నెల్లూరులో 0.453, బుచ్చిలో 2.775, ఉదయగిరిలో 0.274, వింజమూరులో 0.438 ఎంటీల పాడైపోయిన కందిపప్పు ఉంది. దీని విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కేజీ కందిపప్పు ధర రూ.170 వరకు పలుకుతోంది. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.67లకే రేషన్ కార్డుదారులకు అందజేస్తోంది. అయితే ఇప్పుడు పాడైపోయిన కందిపప్పును వేలం వేస్తే చాలా తక్కువ ధర పలికే అవకాశముంది. మిగిలినదంతా ఖజానాకు నష్టమే. కాగా ఈ పాడైపోయిన కిందిపప్పును కూడా మరీ తక్కువ ధరకు కొట్టేసేందుకు కొందరు ట్రేడర్లు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి కొంతమంది అధికారులు తెరవెనుక పరోక్షంగా సహకారమందిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. కాగా జిల్లాలో 7,33,520 రేషన్ కార్డులున్నాయి. ఒక్కో కార్డుకు నెలకు కేజీ కందిపప్పు అందించాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు 733 మెట్రిక్ టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉండగా, ప్రభుత్వం గడిచిన ఎనిమిది నెలల్లో 776 మెట్రిక్ టన్నుల కందిపప్పును మాత్రమే కేటాయించింది. అందులో పంపిణీ చేసింది 568.89 మెట్రిక్ టన్నులు మాత్రమే.





● బియ్యందీ అదే పరిస్థితి

కందిపప్పు మాదిరిగానే గతంలో బియ్యాన్ని కూడా గోదాముల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచడంతో పాడైపోయాయి. గతేడాది సెప్టెంబరులో సుమారు 500 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు వేలం వేశారు. అందులో సుమారు 200 మెట్రిక్ టన్నుల బియ్యం వరకు పాడైపోయాయి. ప్రభుత్వం కేజీ బియ్యాన్ని సుమారు రూ.35 కొనుగోలు చేసి, పేదలకు రూపాయికే అందజేస్తున్నది.. ఇలా అప్పుడు కూడా రేషన్ బియ్యం పాడైపోవడంతో ప్రజాధనం భారీగా దుర్వినియోగమైంది. కాగా పాడైపోయిన కందిపప్పుపై పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీనారాయణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.



గత ఏడాది మర్రిపాడు మండలం చాబోలు, వెంకటాపురం పాయలో కనిపించిన పులి పాదముద్రలు (ఫైల్)



పులి చంపినట్లుగా అటవీశాఖ సిబ్బంది గుర్తించిన ఆవు కళేబరం (ఫైల్)

ఆ పులేనా దాడి చేసింది?

● ఆత్మకూరు అటవీ ప్రాంతంలో గతంలోనే పాదముద్రల గుర్తింపు

● జిల్లాలో ఎన్ని ఉన్నాయన్నదానిపై సందిగ్ధం

● మర్రిపాడు ఘటనతో భయాందోళనలో ప్రజలు



ఆత్మకూరు, జూన్ 17: జిల్లాలోని అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గతంలోనే గుర్తించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని చాబోలు, వెంకటాపురం పాయలో అటవీ సిబ్బంది పులి పాదముద్రలను గుర్తించడమే కాకుండా, కొంతమంది స్థానికులు ప్రత్యక్షంగా చూసినట్లుగా కూడా చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో సోమవారం మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి అటవీప్రాంతంలో పెద్దపులి కారుపై దాడి చేసినట్లుగా కారు డ్రైవర్ పేర్కొన్నారు. అయితే ఆనాడు సంచరించిన పులేనా నేడు దాడికి పాల్పడిందని అనుమానాలు ఉన్నాయి. కాగా అది పెద్దపులి కాకపోవచ్చని చిరుతపులి అయి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా అటవీ ప్రాంతంలో ఎన్ని పులులు ఉన్నాయన్నది సందిగ్ధంలో ఉన్నామని వారు పేర్కొన్నారు. జిల్లా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నది ఒక పులేనా..? లేక రెండు,మూడు ఉన్నాయా.. అన్నది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఉమ్మడి నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని పెనుశిల నరసింహ అభయారణ్యం, లంకమల్లేశ్వర అభయారణ్యం కలిసి 3.8 లక్షల ఎకరాలకు పైగా విస్తరించి ఉన్నాయి. కడప జిల్లాకు సమీపంలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో 2022 సెప్టెంబరులో క్షేత్ర సిబ్బంది మొదటిసారిగా పులి పాదముద్రలను గుర్తించారు. ఆ తరువాత 2023 జనవరి, ఫిబ్రవరిలో మరికొన్ని ప్రాంతాల్లో పులి పాదముద్రలతో పాటు జంతు కళేబరాలను కూడా గుర్తించారు.ఈ కళేబరాలను బట్టి ఆత్మకూరు అటవీ ప్రాంతంలో సంచరించే పులి మూడు ఆవులను చంపినట్లుగా అటవీశాఖ లోని బేస్ క్యాంపుల్లోని సిబ్బంది గుర్తించారు. కాగా జిల్లా అటవీ ప్రాంతంలో ఎన్ని పులులు ఉన్నాయి.. ఎంత దూరం అవి సంచరించాయి..? అని నిర్ధారించే పనిలో అటవీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. పులి సంచారం వార్తల నేపథ్యంలో ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



2023 జూన్ 15వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



అద్దాల మండపానికి పూర్వ వైభవం

● దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 17: నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలోని అద్దాల మండపం నిర్మించి 97 ఏళ్లు అయిందని, దాన్ని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకువస్తామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలకశాఖ మంత్రి పొంగూరి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బాధ్యతలు స్వీకరించాక వారంతా తొలిసారిగా సోమవారం రంగడి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఈవో అరవభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు రంగనాథస్వామి, ఆండాళ్ అమ్మవారు, రంగనాయకమ్మ, ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు అద్దాల మండపం, తల్పగిరి రంగనాథ ఘాట్, పడమటి రాజగోపురాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న రంగనాథ్‌ఘాట్ పనులను త్వరలోనే పునఃప్రారంభిస్తామన్నారు. పడమటి రాజగోపురం పునఃనిర్మాణానికి స్థపతులు వేద పండితులు, అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు యాలమూరి రంగయ్యనాయుడు, ఆనం రంగమయూర్‌రెడ్డి, ఏజీజే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు : రంగనాయకుల స్వామి ఆలయంలోని అద్దాల మండపాన్ని పరిశీలిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, తదితరులు

కావలిలో త్వరలో అన్న క్యాంటీన్

● మహిళా మార్ట్‌ను మరోచోటుకు తరలించేయత్నం



అన్న క్యాంటీన్ భవనంలో వసతులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈ తదితరులు

కావలి, జూన్ 17: అన్న క్యాంటీన్లు పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతకం పెట్టినందున కావలి పట్టణ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో కి రాగానే అన్నా క్యాంటీన్లు మూసివేయడంతో కావలిలో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని అధికారులు పరులపాలు చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికలకు ముం దు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని మెప్మా నిర్వహణలో ఉన్న మహిళా మార్టుకు అప్పగించారు. ప్రస్తుతం ఆ భవనంలో మహిళా మార్టు కొనసాగుతోంది. అయితే అన్న క్యాంటీన్లు ప్రారంభం కానుండటంతో కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్‌కుమార్ తదితరులు అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. చిన్నచిన్న మరమ్మతులు ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన వెంటనే చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మహిళా మార్టును కూడా మరొక చోటకు తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. దీంతో త్వరలో అన్న క్యాంటీన్ భవనానికి పూర్వవైభవం రానుంది.

పులివాహనంపై చాముండేశ్వరిదేవి



ఇందుకూరుపేట, జూన్ 17: మండలంలోని గంగపట్నం గ్రామంలో శ్రీచాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పులి వాహనంపై అమ్మవారు గంగపట్నం పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గేదెను ఢీ కొన్న మోటారు సైకిల్ : ఒకరి మృతి

కలువాయి, జూన్ 17: వెరుబొట్లపల్లి సమీపంలో ఆదివారం రాత్రి మోటారు సైకిల్ గేదెను ఢీ కొన్న సంఘటనలో కేశమనేనిపల్లికి చెందిన చీపినాపి పెంచల నరసయ్య (50) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. పెంచల నరసయ్య ఆదూరుపల్లి నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుత్తుండగా రోడ్డుకు అడ్డంగా గేదె రావడంతో దాన్ని ఢీకొని కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం అయ్యింది. అతన్ని చికిత్సనిమిత్తం 108లో నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మినీవ్యాను బోల్తా: డ్రైవర్‌కు గాయాలు





బోల్తాపడ్డ మినీవ్యాను

పుచ్చకాయల కోసం ఎగబడుతున్న జనం

వరికుంటపాడు, జూన్ 17: రామాపురం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం పుచ్చకాయల లోడుతో వెళ్తున్న ఓ మినీ వ్యాను ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి కడప జిల్లా బద్వేలుకు వేగంగా వెళ్తున్న ఆ మినీవ్యాను అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పుచ్చకాయలు సైతం జాతీయ రహదారిపై దారి పొడవునా చెల్లా చెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న ప్రజలతో సహా అటుగా వెళ్లే ప్రయాణికులు తమకు కాయలు దొరికితే చాలు అన్నట్లుగా వాటి కోసం ఎగబడి సంచుల్లో నివాసాలకు తీసుకెళ్లారు.

చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఉప్పల వెంకటేశ్వర్లు

మనుబోలు, జూన్ 17: కోదండ రామపురానికి చెందిన కల్లుగీత కార్మికుడు ఉప్పల వెంకటేశ్వర్లు సోమవారం మధ్యాహ్నం స్థానిక పొలాల్లో తాటిచెట్టుపై నుంచి జారిపడి గాయపడ్డాడు. వృత్తిరీత్యా కల్లుగీత కార్మికుడు. చెట్టు ఎక్కేటపుడు గాలి, వర్షం రావడంతో పట్టు తప్పి పైనుంచి పడి పోయాడు. దీంతో వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం వలన వెంకటేశ్వర్లు కుడికాలు, మిగతా శరీర బాగాలు దెబ్బతిన్నాయి. వెంకటేశ్వర్లు కుటుంబానికి సొసైటీ తరఫున న్యాయం చేసి, అండగా నిలుస్తామని మనుబోలు కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షుడు కుడుముల వెంకటరమణయ్య గౌడ్, కార్యదర్శి కోసూరు సురేష్‌గౌడ్ తెలిపారు.

సెబ్ స్టేషన్‌లో ఎలాంటి అవకతవకలు జరగలేదు

ఇందుకూరుపేట, జూన్ 17: ఇందుకూరుపేట సెబ్ స్టేషన్‌లో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని సీఐ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

- పరారైన నిర్వాహకులపై చీటింగ్ కేసు

నెల్లూరు(క్రైం), జూన్ 17: చిట్టీల పేరుతో మోసగించి పరారైన నిర్వాహకులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరానికి చెందిన షబనా, సురేష్‌రెడ్డిలు చిట్టీలు నిర్వహించేవారు. వారిని నమ్మి పలువురు రూ.లక్షల్లో చిట్టీలు వేశారు. హరనాథపురానికి చెందిన సురేఖ వారి వద్ద రూ.5 లక్షల చిట్టీలు రెండు వేశారు. చిట్టీల సమయం ముగియడంతో నగదు ఇవ్వాలని కోరినా నిర్వాహకులు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సురేఖ వద్ద తమ అవసరాల కోసం రూ.4.50 లక్షల తీసుకొని ప్రాంసరీ నోట్లు రాసి ఇచ్చారు. అనంతరం వారు ఊరు విడిచి పరారయ్యారు. బాధితురాలు సురేఖ చిట్టీల నిర్వాహకులపై సోమవారం బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నాచెల్లెళ్ల గొడవతో బాలిక ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 17: ఇంట్లో టీవీ రిమోట్ వద్ద అన్న, చెల్లెల మధ్య జరిగిన చిన్న వివాదంతో మనస్తాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగరంలోని వారధి సెంటర్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వారధి సెంటర్‌కు చెందిన శివకుమార్, కాంచన దంపతులకు మహేంద్ర, రాజేశ్వరి(14) సంతానం. శివకుమార్ వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. కుమారుడు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా, కుమార్తె పదో తరగతి చదువుతోంది. సోమవారం టీవీ రిమోట్ విషయంలో అన్నా, చెల్లెలు మధ్య వివాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంట్లోని బాత్‌రూమ్‌లోకి వెళ్లి చీరతో సీలింగ్ కొయ్యదూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక కనిపించక పోవడంతో బాధిత కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు బాత్‌రూమ్ తలుపు లోపల గడియ పెట్టి ఉండటంతో తలుపులు తట్టినా ఎవ్వరూ స్పందించ లేదు. దీంతో స్థానికుల సహకారంతో తలుపు పగులగొట్టి చూడగా బాలిక ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉంది. జరిగిన విషయాన్ని మృతురాలి తల్లి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ ఏ సుబ్బరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనలో అందని బిల్లులు

- టీడీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు నిలిపివేత..
- పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు నిర్వీర్యం..



అసంపూర్తిగా ఉన్న పంచాయతీ, అంగన్‌వాడీ భవనం

తోటపల్లిగూడూరు, జూన్ 17: తెలుగుదేశం అధికారంలో ఉండగా 2018వ సంవత్సరంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంచాయతీ భవన నిర్మాణానికి, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పంచాయతీ భవనానికి రూ.15లక్షలు, అంగన్‌వాడీ భవనానికి రూ.8లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చేసిన పనులకు కూడా బిల్లులు రాకపోవడంతో ఈ భవనాలు ఇప్పటికీ నిర్వీర్యంగానే ఉన్నాయి. పంచాయతీ భవన నిర్మాణానికి మరమ్మతులకు కనీస నిధులు మంజూరు చేయలేదని గ్రామ మాజీ సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసులు వాపోయారు. అదేవిధంగా అంగన్‌వాడీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిపివేయడంతో అద్దె భవనంలో చాలీచాలని వసతులతో విధులు నిర్వహిస్తున్నారు. వైసీపీ ఈ ఐదు సంవత్సరాల పాలనలో కేవలం తెలుగుదేశం పంచాయతీ అన్న ఒక్క కారణంతో చేసిన పనులకు బిల్లులు వేయకుండా ఆపేశారని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో చేసిన బిల్లులకు అసంపూర్తిగా నిర్మించిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	152
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	266
స్కిన్‌లెస్	296
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6822
వెండి కిలో ధర	రూ. 90,200
వెండి ఒక గ్రాము	రూ. 92.20

ఉంచేనా.. ఊడపీకేనా?

- ఎండీయూ వాహన యజమానుల్లో ఆందోళన
- జిల్లావ్యాప్తంగా 438 వాహనాలు
- ఒక్కొక్క వాహనానికి రూ. 18 వేలు
- ఆపరేటర్‌కు గౌరవవేతనం రూ. 5 వేలు
- ప్రభుత్వం మారడంతో కొనసాగింపుపై సందిగ్ధం
- వైసీపీ హయాంలో డీలర్‌షిప్ పొందిన వారి పరిస్థితి అంతే...!



ఉదయగిరి రూరల్ : కార్డుదారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం(ఫైల్)

సంగం/ఉదయగిరి రూరల్, జూన్ 17: జిల్లాలో ఇంటింటికీ నిత్యావసర వస్తువుల పేరులో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహన యజమానుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ఆ పార్టీ సానుభూతి పరులతో ఈ వాహనాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 7.20 లక్షల కార్డుదారులు ఉండగా, 438 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నారు. వాహన యజమానికి నెలకు రూ.18 వేలు, వాహనంలో బియ్యం ఎత్తేందుకు, దించేందుకు ఆపరేటర్‌కు మరో రూ.5 వేలు గౌరవవేతనంగా ఇస్తున్నారు. అలా ఒక్కొక్క వాహనానికి నెలకు రూ.23 వేలు గత ప్రభుత్వం చెల్లించేది. నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రతినెలా ఒకటిన ప్రారంభించి 15వ తేదీ నాటికి పూర్తి చేసేవారు. సర్వర్ సమస్య ఉంటే మరో రెండు, మూడు రోజులు పొడిగించేవారు. మిగిలిన 12 రోజులు ఎండీయూ వాహన యజమానులు ఇతర పనులు చేసుకొనే వారు. ఇటీవల ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిం ది. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం గతంలో మాదిరిగానే నిత్యావసర వస్తువు లను కార్డుదారులకు పంపిణీ చేస్తుందని ప్రచారం జోరుగా సాగుతోం ది. దీంతో వాహన యజమానుల్లో ఆందోళన నెలకొంది. ఇంటింటి కీ రేషన్ పంపిణీ చేసేందుకు కొత్తగా టెండర్లు పిలిచి టీడీపీ మద్దతుదారులకు వాహనాలను అప్పగిస్తే తమ పరిస్థితి ఏంటని వారు మదనపడుతున్నారు.

స్వచ్ఛందంగా తప్పుకునేందుకు సిద్ధం

టీడీపీ అధికారంలోకి రావడంతో చాలా మంది రేషన్ డీలర్లు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో చాలాచోట్ల సుదీర్ఘకాలంగా రేషన్ దుకాణాలు నిర్వహిస్తున్న వారి చేత బలవంతంగా రాజీనామాలు చేయించి, వైసీపీలోని ద్వితీయ శ్రేణి నేతలకు అప్పగించారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో గతంలో తాము చేసిన విధంగానే టీడీపీ వారు చేస్తారని భావించి వైసీపీ హయాంలో డీలర్‌షిప్ పొందినవారు ప్రస్తుతం స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు ముందుకు రాగా, కొంతమంది వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. రేషన్ దుకాణాలకు ఈనెల 20వ తేదీలోపు వచ్చేనెలకు సంబంధించి బియ్యం, కందిపప్పు, పంచదారకు డీడీలు తీయాల్సి ఉంది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

● రంగంలోకి పాత డీలర్లు

వైసీపీ ప్రభుత్వం టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న రేషన్ డీలర్లను బలవంతంగా తొలగించింది. ఇప్పుడు అటువంటివారు ప్రజాప్రతినిధులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు కొందరు డీలర్ పోస్టుకు పోటీ పడుతున్నారు. ఈ నెలాఖరులోపు పలువురు డీలర్లను మార్చే అవకాశముందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సిఫార్సుల మేరకు కొత్త డీలర్లతో డీడీలు కట్టించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

జీజీహెచ్‌లో పాము కలకలం!



చికిత్స పొందుతున్న కార్మికురాలు

నెల్లూరు(వైద్యం), జూన్ 17 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం పారిశుద్ధ్య కార్మికురాలు రత్నమ్మను అత్యంత విషపూరితమైన రక్తపింజరి (పాము) కాటేసింది. దీంతో తోటి కార్మికులు బాధితురాలిని వెంటనే జీజీహెచ్‌లోని ఐసీయుకు తరలించగా వైద్యుల సంరక్షణల చికిత్స పొందుతోంది. వివరాల మేరకు... రత్నమ్మ అనే పారిశుద్ధ్య కార్మికురాలు వైద్య కళాశాల ఆవరణంలోని గడ్డిని తొలగిస్తుండగా అక్కడే ఉన్న రక్తపింజరి (పాము) చేతివేలిపై కాటేసింది. ఆమె కేకలు వేయగా సహచర సిబ్బంది బాధితురాలి పరిస్థితిని గుర్తించి ఆసుపత్రిలోని క్యాజువాలిటీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఐసీయుకు తరలించారు. గతంలోనూ పాము కాటుతో ఓ కార్మికురాలు మృతి చెందిన ఘటన మరువక ముందే ఇలాంటి సంఘటన జరగడంపై పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

● పెస్ట్ కంట్రోల్ నిర్లక్ష్యం

జీజీహెచ్‌లో పాములు, చెదలు, ఎలుకల బెడద లేకుండా చూసే బాధ్యత పెస్ట్ కంట్రోల్ కాంట్రాక్టర్‌దే. ఆ మేరకు కాంట్రాక్టర్‌కు ఏటా లక్షల రూపాయలు చెల్లిస్తున్నారు. అయితే కాంట్రాక్టు పొందిన వ్యక్తి నిబంధనలు గాలికొదిలేసి, కేవలం మందును పిచికారి చేయడమే తప్ప పాములు, ఎలుకలు లేకుండా చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలుకలు లేకుండా చేసేందుకు బోన్లు పెట్టాలి. అలాగే పాములకు నిలయమైన పుట్టలు, బొరియలు తొలగించాలి. బొద్దింకలు, చెదపురుగులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి. కానీ ఇవేవీ అమలు చేయకపోయినా అధికారులు కాంట్రాక్టర్‌కు కొమ్ము కాస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపటి నుంచి ఐటీఐలో ప్రవేశానికి కౌన్సెలింగ్

నెల్లూరు(విద్య), జూన్ 17 : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 సంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19, 20వ తేదీల్లో వెంకటేశ్వరపురం బాలుర ఐటీఐ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారి మార్కులు ఆధారంగా 19న ఉదయం మెరిట్ నెం 1 నుంచి 150 వరకు, మధ్యాహ్నం 151 నుంచి 300 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20న ఉదయం 301 నుంచి 450 వరకు, మధ్యాహ్నం 451 నుంచి 620 నెంబర్ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఇప్పటికే మొబైల్స్ ద్వారా సమాచారం అందచేశామని, ప్రతి విద్యార్థి తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని తెలిపారు.

సోమశిలకు 1,320 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 17: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 1,320 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిసాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.960 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

ఏపీ ఏఈఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దయాబాబు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ (ఏపీఏఈఎస్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్‌వీ.దయాబాబు ఎన్నికయ్యారు. నెల్లూరులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం వ్యవసాయశాఖ మినిస్టీరియల్, నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఏఈఎస్ అసోసియేషన్ ఎన్నికల్లో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.శ్రీధర్‌రావు, సెక్రటరీగా ఎస్‌కె.నిజాముద్దీన్, కోశాధికారిగా సీహెచ్ యోగేశ్వర్, ఉపాధ్యక్షులుగా టి.సుభాషిణి, కె.రవి, ఎం.బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిలుగా ఎన్.అపర్ణ, ఎన్.నాగార్జున, జాయింట్ సెక్రటరీలుగా టి.విజయకుమార్, ఎం.ప్రసాద్, టి.సాయిసుమ, సీహెచ్ నాగేంద్రమ్మ, స్టేట్ కౌన్సిలర్‌గా పి.గోపీకృష్ణ, జిల్లా ఈసీ మెంబరుగా కె.శివకుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీఏఈఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయి, కార్యదర్శి రవికుమార్, జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు పెంచలయ్య పాల్గొన్నారు. ఎన్నికల అధికారులుగా ఎం వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ, ఎన్నికల పరిశీలకులుగా శ్యాంసుందర్ వ్యవహరించారు. ఎన్నికైన వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

పరమానంద ఆశ్రమంలో మంత్రి, చిన్నజీయర్ స్వామి

కలువాయి, జూన్ 17 : సోమశిల పరమానంద ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో త్రిదండి చిన్నజీయర్ స్వామితో కలిసి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి ఆనం చేతులు మీదుగా ఆశ్రమంలో గోశాలను ప్రారంభిం చారు. అనంతరం కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. దేవదాయశాఖ మంత్రి హోదాలో తొలిసారిగా ఆనం రామనారాయణరెడ్డి పరమానంద ఆశ్రమానికి వచ్చారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట పలువురు నాయకులు ఉన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకువెళుత్తున్న మంత్రి ఆనం

టిడ్కో ఇళ్లు.. గంజాయి ముఠాలకు అడ్డా

- పంపిణీ చేసుంటే లక్షలమంది హాయిగా బతికేవారు
- టీడీపీ నేత కిరాక్ ఆర్‌పీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 17: టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక గంజాయి ముఠాలకు అడ్డాగా మార్చారని టీడీపీ నాయకులు కిరాక్ ఆర్పీ ఆరోపించారు. నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని అల్లీపురం వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో నిర్మిం చిన లక్షలాది టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించి ఉంటే ఎంతోమంది హాయిగా బతికేవారన్నారు. చంద్రబాబునాయుడు నిర్మించాడన్న ఒక్క కారణంతోనే జగన్ ప్రజలకు ఆ ఇళ్లను అప్పగించలేదన్నారు. రుషికొండను చీల్చి చెండాడి సొంత ప్రయోజనాల కోసం ఇంద్రభవనాలు కట్టుకున్న జగన్ పేదల కోసం నిర్మించిన ఇళ్లను ఇవ్వడానికి మాత్రం మనసు రాలేదన్నారు. రాష్ట్రంలో అధికార దుర్వినియోగం చేస్తూ పాలన సాగించిన జగన్ ఏ ముఖం పెట్టుకొని మళ్లి ప్రజల్లోకి రావాలనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రస్తుతం ఈ ఇళ్లను చూస్తుంటే రామ్‌గోపాల్‌వర్మ సినిమాల్లో చూపించిన విధంగా బూత్‌బంగ్లాలు గుర్తుకు వస్తున్నాయన్నారు. నెల్లూరులో తొడలు కొట్టే మాజీ మంత్రికి పేదలకు సొంత ఇళ్లు అప్పగించాలన్న విషయమే గుర్తుకు రాలేదా ? అని ఆర్‌పీ ప్రశ్నించారు. నోరేసుకుని వాగే రోజా క్రీడామంత్రిగా ఉన్న సమయంలో చేసిన స్కామ్‌లు బయట పడుతున్నాయని, త్వరలోనే ఆమె జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్లకు మరమ్మతులు చేయించి త్వరలోనే చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు అందిస్తారని ఆయన తెలిపారు.





నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కిరాక్ ఆర్‌పీ

అన్నదాతకు బాబుపైనే ఆశలు

- గత ప్రభుత్వంలో సేద్యంపై చిన్నచూపు
- అందని సబ్సిడీ పనిముట్లు
- మార్కెట్లో పెరిగిన ధరలతో అదనపు భారం
- ప్రస్తుత ప్రభుత్వం ఇస్తుందనే నమ్మకం

సంగం, జూన్ 17 : వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ దుక్కులు చేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహం కరువై అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగానికి వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేయడం భారంగా మారింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో గతంలోలా సబ్సిడీతో యంత్ర పరికరాలు పంపిణీ చేస్తుందనే ఆశతో అన్నదాతలు ఉన్నారు.

● వైసీపీ పాలనలో అంతా ఆర్భాటమే

ప్రతి రైతుకు గతంలో పాడి ఎద్దులు ఉండేవి. సేద్యానికి ఇబ్బంది ఉండేది కాదు. ట్రాక్టర్ వంటి ఆధునిక పరికరాలు వచ్చిన తరువాత ఎద్దుల పోషణ కష్టంతోపాటు భారం కావడంతో ఆధునిక సేద్యం వైపు రైతులు మొగ్గు చూపారు. ప్రస్తుతం సేద్యం చేయాలంటే ట్రాక్టర్లే దిక్కు. టీడీపీ హయాంలో 50 శాతం రాయితీతో నాగలి, రోటోవేటర్లు, కేజీ వీల్స్‌తోపాటు పలు రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేవారు. వైసీపీ అధికారం చేపట్టాక రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిలో అన్ని రకాల పురుగు మందులు, ఎరువులు అందుబాటులో ఉంచుతామని పాలకులు ప్రగల్భాలు పలికారు. రైతులతో గ్రూప్‌లు ఏర్పాటు చేసి ట్రాక్టర్లను అందచేశారు. వంతుల వారీగా పొలాలు దుక్కులు చేసుకోవాలని సూచించారు. ఓ రైతు పేరుతో ట్రాక్టర్‌ను మంజూరు చేసి, మిగతా రైతులకు తక్కువ అద్దెకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ రైతే సొంతం చేసుకుని గ్రూపులోని మిగతా రైతులకు ఇచ్చిన పాపాన పోలేదు. దీంతో ఆ పథకం నిరుపయోగమైంది. ప్రస్తుతం ట్రాక్టర్ ఉన్న రైతులు పెరిగిన ధరలను చూసి కొనుగోలుకు జంకుతున్నారు. గతంలో ఇచ్చిన పరికరాలు పనికి రాకుండా పోయాయి. బయట మార్కెట్లో కొందామంటే రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ పరికరాలు ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



వ్యవసాయ ఆధునిక పరికరాలు

● పెరిగిన దుక్కి రేట్లు

ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో ట్రాక్టర్‌తో ఒకసాలు దుక్కి దున్నితే రూ.1100 వెచ్చించాల్సి వస్తోంది. ఒక ఎకరాలో నాలుగు సాళ్లు దున్నితే రూ.4500 నుంచి 5వేలు ఖర్చవుతుంది. ధరలు రెండు, మూడింతలు పెరిగాయని రాయితీతో పరికరాలు పంపిణీ చేయకపోవడంతో బహిరంగ మార్కెట్లో పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయలేకపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా ప్రభుత్వం ఒక్క పరికరం కూడా ఇవ్వలేదని, ప్రస్తుత సీజన్‌లో దుక్కులు ఎలా చేసుకోవాలో అర్థం కాకడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం గతంలోలా సేద్యానికి పెద్దపీట వేసి రాయితీపై ఆధునిక సేద్య యంత్ర పరికరాలు పంపిణీ చేస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

● భారీగా పెరిగిన ధరలు

వ్యవసాయ పరికరాల ధరలు ఈ ఏడాది బాగా పెరిగాయి. స్ప్రింగ్ మడకలు రూ.32 వేలు, ఏడు మడకలు రూ.90 వేలు, ఐదు మడకలు రూ.70వేలు, పాపనగుంటక రూ.28 వేలు, బోది గుంటక రూ.40వేలు, విత్తన గొర్రు రూ. 25వేలు, రోటోవేటర్ రూ.1.25 లక్షల వరకు పలుకుతున్నాయి. గతంలో చిన్న సన్నకారు రైతులకు వీటిని 50 శాతం రాయితీపై అందించే వారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా శాఖ సమావేశం బుధవారం ఉదయం 9.30 గంటలకు నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షనర్స్ భవనంలో జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎం.గౌస్, కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరై డీఆర్, పీఆర్సీ బకాయిలు, 12వ పీఆర్సీల గురించి తదితర పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి పెన్షనర్స్, పబ్లిక్ కుటుంబాలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పెన్షనర్లు అందరూ తరలిరావాలని కోరారు.

వైభవంగా సంతానలక్ష్మి ఉత్సవాలు


సంగం: శేషవాహనంపై గ్రామోత్సవంలో ఆత్మారామస్వామి


చెర్రీస్ పండ్ల అలంకరణలో మాతాపరమేశ్వరి


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి రూరల్, జూన్ 17: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన శ్రీసంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు లోకా వెంకటప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, గోపూజ, నవగ్రహ హోమాలు, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హారతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మేళతాళాల నడుమ పుట్టమన్ను తీసుకొచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం


దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయం

గన్నేపల్లి పంచాయతీలో వెలసిన అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి పాలాయిలను అమ్మవారి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో ప్రతిష్ఠించి కొట్టాలపల్లి, బీసీ కాలనీ, గన్నేపల్లి, సర్వరాబాదు మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి వాహనం వెంట మహిళలు కడవతో నీరు పోసి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొన్నారు. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన స్థానికులు కుటుంబ సమేతంగా గ్రామాలకు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఘనంగా శేష వాహనసేవ

సంగం, జూన్ 17: అన్నారెడ్డిపాళెంలో వెలసిన ఆత్మారామస్వామి ఆది వారం అర్ధరాత్రి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సీతాదేవి, ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఉంచి గజ పూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

పరమేశ్వరికి చెర్రీస్ పండ్లతో అలంకరణ


ఉదయగిరి: ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మి

స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన మాతాపరమేశ్వరిని భక్తులు చెర్రీస్ పండ్లతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దువ్వూరు గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిర్వాహకులు ఆలయాన్ని రంగులు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు. 9రోజులపాటు జరిగే ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు రోజుకొక వాహనంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మొదటిరోజు అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 19వ తేదీన ధ్వజారోహణ, చిలుక వాహన, 20న రావణసేవ, 21న నందిసేవ, 22న అంబారి సేవ, 23 కల్యాణోత్సవం, పురుషామృగ సేవ, 24న అశ్వవాహనం, 25న శేషవాహనం, 26న ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

నేడు అధికారులతో సమీక్ష

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 17: నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు జరుగుతున్న దృష్ట్యా మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు కార్యాలయ ఆవరణలో పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావలి ఆర్డీవో శీనానాయక్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు. బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో అమ్మవారి హుండీల లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

ఏవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వాసిపల్లి శంకర్‌రెడ్డి




దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 17: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వాసిపల్లి శంకర్‌రెడ్డి ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇటీవల తాడేపల్లి గూడెంలో జరిగిన ఆంధ్ర విద్యార్థి రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన్ను రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. శంకర్‌రెడ్డి మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో క్రియాశీలకంగా పని చేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఏవీఎస్ నాయకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు శంకర్‌రెడ్డికి అభినందనలు తెలిపి సన్మానించారు.

టీడీపీలోనే బీసీలకు ప్రాధాన్యం

వరికుంటపాడు, జూన్ 17: తెలుగుదేశం తొలినుంచి బీసీ వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని నెల్లూరు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి అరవ రవీంద్రయాదవ్ అన్నారు. ఈ విషయంపై సోమవారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు తగిన సీట్లు కేటాయించడంతో పాటు మంత్రివర్గంలోనూ యాదవ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురికి అవకాశం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా యాదవ సామాజిక వర్గానికే చెందిన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ను నూతనంగా నియమించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెన్త్ విద్యార్థినికి రూ.20వేలు అందజేత


విద్యార్థినికి నగదును అందిస్తున్న విశ్వేశ్వరచౌదరి, సర్పంచు పెంచలయ్య, ఉపాధ్యాయులు

కలువాయి, జూన్ 17: ఈ ఏడాది పదో తరగతిలో 572 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది చీపినాపి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కే.తాసిఫా. ఈ విద్యార్థికి సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన మదమంచి విశ్వేశ్వర చౌదరి రూ.20వేలు నగదు అందజేశారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచు జీ.పెంచలయ్య, హెచ్. జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలినడకన పెంచలకోనకు..

కలువాయి, జూన్ 17 : వెంకటగిరి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ విజయం సాధించడంతో కలువాయికి చెందిన కోట పెంచలయ్య కలువాయి నుంచి పెంచలకోనకు కాలి నడకన వెళ్లి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తలనీలాలు సమర్పించాడు. ఈ సందర్భంగా పెంచలయ్యకు పలువురు టీడీపీ నాయకులు పండ్లు అందజేశారు.

పునాదుల దశదాటని సచివాలయాలు

● అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న వైనం

● బాడుగ చెల్లించలేదని వాశిలి సచివాలయానికి తాళం


అద్దె భవనంలో కొనసాగుతున్న సచివాలయం

ఆత్మకూరు, జూన్ 17: వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రతిగ్రామంలో గ్రామ సచివాలయం, విలేజీ హెల్త్ క్లీనిక్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రెరీ, వైఎస్‌ఆర్ రైతుభరోసా, అంగన్‌వాడీ కేంద్రాలతో ఊర్లు మారాయంటూ పాలకులు ఊదరగొట్టారు. కొన్ని గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. చాలా సచివాలయ కేంద్రాలు పునాదులకే పరిమితమయ్యాయి. దాంతో కొన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాశిలి గ్రామంలో సకాలంలో అద్దె చెల్లించకపోవ డంతో భవన యజమాని సచివాలయానికి తాళం వేశాడు. దాంతో పది రోజులకు పైగా వాశిలి సచివాలయం మూత పడింది.

● వాశిలి గ్రామంలో..

గ్రామంలో 700 కుటుంబాల్లో 2500 మందికి పైబడి జనాభా ఉంది. గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనా వాటి నిర్మాణ పనులు పునాదులు దాట లేదు. సచివాలయ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతోంది. నెలకు రూ.3వేలు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి పరిస్థితి నెలకుని ఉంది. అయితే భవన యజమానికి సకాలంలో అద్దె చెల్లించక రూ.85 వేల వరకు బకాయి పేరుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం ఓటమి చెందడంతో బకాయి చెల్లించాలని యజమాని కోరారు. అధికారులు స్పందించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో అతను సచివాలయానికి తాళం వేశాడు. సచివాలయంలో ఉన్న సామగ్రిని ఆ గ్రామంలోని ప్రభుత్వ భవనంలోకి తరలించేందకు అధికారులు సన్నద్ధం అయ్యారు. కాని అద్దె చెల్లించేంత వరకు తాళాలు ఇచ్చేందుకు భవయ యజమాని అంగీకరించలేదు. దాంతో పది రోజులకుపైగా సచివాలం మూతపడడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి.

● అభివృద్ధికి ఆమడ దూరం

వాశిలిలో రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు మంజూరైనా వాటి నిర్మాణ పనులు సైతం పునాదులు దాట లేదు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నాడు- నేడు కింద అదనపు గదుల నిర్మాణానికి రూ.88.99 లక్షలు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదు. పాఠశాలకు కనీసం రంగులు వేసిన దాఖలాలు కూడా లేవు. బస్టాండ్ సెంటర్ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు కళ తప్పి విహీనంగా ఉన్నాయి. ప్రహరీ లేక ముళ్ల కంచె ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు.

అద్దె చెలించమని సర్పంచ్‌కు చెప్పాం

- బాలాజీ నాయక్, ఎంపీడీవో, ఆత్మకూరు

అద్దె బకాయి విషయమై సచివాలయ యజమానితో మాట్లాడాం. గ్రామ సర్పంచును అద్దె బకాయి వెంటనే చెల్లించాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయనికి పిలిపించి సమస్యలను పరిష్కరిస్తాం. గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యే దిశగా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

మురుగు కాలువలపై అక్రమ కట్టడాలు

● పట్టించుకోని అధికారులు


కాలువలపై అక్రమ కట్టడాలు

వింజమూరు, జూన్ 17: పట్టణంలోని పాతూరు ప్రధాన మురుగుకాలువలపై అక్రమ కట్టడాలు నిర్మించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యతో వర్షాకాలంలో వర్షపు నీరు పోయే దారి లేక రోడ్డుపైనే నిలిచిపోతుందని మండిపడుతున్నారు. పూడిక తీసే వీలు లేక మురుగు పేరుకుపోతుందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయని, వర్షపు నీరు పోయే దారిలేక అలాగే వర్షపు నీరులోనే నడకసాగించాల్సి వస్తుందంటున్నారు. ఈ సమస్యపై స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూర్తికాని అదనపు గదుల నిర్మాణం

వింజమూరు, జూన్ 17: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని అదనపు గదుల నిర్మాణా లు పూర్తికాలేదు. ఈ సమస్యతో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి పనులు పూర్తికావాల్సి ఉన్నా ఇప్పటికీ నాడు- నేడు కింద నిధులు మంజూరు కాకపోవడంతో ఈ సమస్య నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాల కులు, ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి పను లు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భయంభయంగా విధుల నిర్వహణ

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 17: నర్రవాడ పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ సమస్యతో సచివాలయ సిబ్బంది ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభం నుంచి సచివాలయాన్ని పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. అయితే పంచాయతీ కార్యాలయం శ్లాబు మొత్తం దెబ్బతిని ఇనుపసువ్వలు బయట పడడంతో ఎప్పుడు కూలి ఏ ప్రాణ నష్టం జరుగుతుందో అని ఉద్యోగులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పెచ్చులూడిన పంచాయతీ కార్యాలయం

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

భక్తిశ్రద్ధలతో బక్రీద్


కావలి: ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని కలిసిన ముస్లింలు

కావలి, జూన్ 17: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం కావలిలోని పలువురు ముస్లింలు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లగా వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రవక్తల దైవభక్తి, త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనం అన్నారు. నియోజకవర్గంలోని ముస్లింలందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.


కందుకూరు: ముస్లింలతో కలిసి బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కిటకిటలాడిన మసీదులు

కావలి టౌన్ : బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు వెంగళరావు నగర్, వైకుంఠపురం, ఇందిరమ్మ కాలనీ ఈద్గాలు, రైల్వే రోడ్డు లోని జామియా మసీద్, కచ్చేరి మిట్ట, కసాయివీధి, ఇస్లాం పేట, జెండా వీధి, తుపాన్‌నగర్, ఇందిరానగర్, ముసునూరులోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


కావలి టౌన్ : వెంగళరావునగర్ ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

కావలి రూరల్: కావలి మండలంలోని గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సిరిపురం, ఆర్సీపాలెం, సర్వాయపాలెం, గౌరవరం తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు.

కందుకూరు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టణానికి చెందిన ముయిద్ నివాసానికి విందుకు వెళ్లి ముస్లిం సోదరుల సమక్షంలో బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. ఆయన వెంట పట్టణ టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నియోజకవర్గంలోని గ్రామాల్లో బక్రీద్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆత్మకూరులోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు నమాజు చేయగా, మతగురువులు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. ముందుగా చిన్నపీర్లచావిడి వద్ద నుంచి వారు ప్రదర్శనగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. మహిమలూరు, బట్టేపాడు, కరటంపాడు, నాగులపాడు గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుర్బాని కార్యక్రమాన్ని నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని ఈద్గా మైదానం, గండిపాళెం, వెంగళరావునగర్, దాసరిపల్లి, బిజ్జంపల్లి, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈద్గాల వద్ద మతపెద్దలు ఖురాన్ సందేశం ఇచ్చారు. బంధుమిత్రులను విందుకు ఆహ్వానించి సహపంక్తి భోజనాలు చేశారు. పేదలకు దానధర్మాలు చేయడంతో పాటు ఖుర్బానీ అందజేశారు. ఉదయగిరి ఈద్గా మైదానం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వేల్పుల గిరిబాబు తన సిబ్బందితో చర్యలు చేపట్టారు.

అల్లూరు: బక్రీద్ పండుగను అల్లూరుతోపాటు నార్తుమోపూరు, ఇస్కపల్లి, మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

జలదంకి : మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. జలదంకి, జమ్మలపాలెం, చినక్రాక, గట్టుపల్లి, చోడవరం, బీకె అగ్రహారం, క్రిష్ణాపాడు, సోమవరప్పాడు గ్రామాలలోని మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కలిగిరి : మండలంలోని కలిగిరి, వెలగపాడు, పెద్దపాడు, క్రాకుటూరు, అనంతపురం గ్రామాల్లో మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు హిందూ సోదరులకు ముస్లింలు విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులకు హిందువులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

వింజమూరు... చిట్రగుంట: బోగోలు మండలంలో ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. చెంచులక్ష్మీపురం, ఇబ్రహీం పేట, నాగులవరం తదితర గ్రామ ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

లింగసముద్రం: బక్రీద్ పండుగను మండలంలోని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం లింగసముద్రం పంచాయతీలోని జంగం రెడ్డిపాలెం వద్ద గల ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అలాగే మండలం లోని ఆర్‌ఆర్‌పాలెం, పెదపవని, చిన పవని, మొగిలిచెర్ల గ్రామాలలోని ముస్లింలు పండుగను జరుపుకున్నారు.

సంగం: సంగం, తలుపూరుపాడు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. సిద్దీపురం, దువ్వూరు, జండాదిబ్బ, మర్రిపాడు, కోలగట్ల, తరుణవాయి గ్రామాల్లోని మసీద్‌లలో ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు వస్త్ర, అన్న, నగదు రూపేనా దానధర్మాలు చేశారు.

అనంతసాగరం: సోమశిల, ఉప్పలపాడు, అనంతసాగరం, ముస్తాపురం, పాతాళపల్లి, పాతదేవరాయపల్లి, ఆమనిచిరివెళ్ల, కచ్చేరిదేవరాయపల్లి, గౌరవరం గ్రామాల్లో నమాజు చేసి ప్రాముఖ్యతను ఇమాంలు తెలిపారు.

సీతారామపురం: మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ భక్తి, విశ్వాసం, త్యాగానికి ప్రతీక అని కొనియాడారు. సమాజంలో సాటివాళ్ల పై ప్రేమాభిమానాలు పంచేందుకు ప్రేరణ ఇవ్వాలని సూచించారు.

దుత్తలూరు: మండలకేంద్రంతో పాటు నర్రవాడ, నందిపాడు, లక్ష్మీపురం, తురకపల్లి, ఏరుకొల్లు గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేయడంతో పాటు ఖుర్బానీ అందజేశారు.

వరికుంటపాడు: తూర్పుబోయమడగల, జడదేవి, వరికుంటపాడు, హుస్సేన్‌నగర్, రామాపురం, తిమ్మారెడ్డిపల్లి, వేంపాడు, విరువూరు, కొత్తపల్లి, బ్రాహ్మణపల్లి, తోలచెరువుపల్లి గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు సైతం నివాసాల్లోనే నమాజులు చేశారు. స్థోమతను బట్టి కొంతమంది ఖుర్బానీలు ఇచ్చి భక్తిభావాన్ని చాటుకున్నారు.

ఏఎస్ పేట: మండలకేంద్రంతో పాటు అనుమసముద్రం, రాజవోలు, హసనపురం, గుంపార్లపాడు గ్రామాల్లో ముస్లిలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏఎస్ పేటలోని దర్గా, మసీదును ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు.

వింజమూరు: పట్టణంలోని ముస్లింలు ప్రార్థనా మందిరాల్లో దువాలు జరిపి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బంధుమిత్రులకు వారి ఇంటి దగ్గర విందును ఏర్పాటు చేశారు.


ఏఎస్‌పేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సీతారామపురం: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా చెన్నకేశవుడి కల్యాణం


కల్యాణ వేదికపై శ్రీదేవీ, భూదేవి సమేత చెన్నకేశవుడు

చిట్రగుంట, జూన్ 17: బోగోలు మండలం కుమ్మరవీధిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ దర్శన, విష్ణు హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యంలో పాల్గొన్నారు.

మంత్రి ఆనం, సోమిరెడ్డిలను కలిసిన కలిగిరి నేతలు


మంత్రి ఆనంను సత్కరిస్తున్న కలిగిరి నేతలు

కలిగిరి, జూన్ 17 : దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలను కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పలువురు నేతలు వారి స్వగృహాల్లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలం అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కన్వీనర్ చీమల తాతయ్య, టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బివి రామారావు, చింతంరెడ్డి సుబ్బారెడ్డి, కొప్పోలు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పట్ల అవగాహన

చిట్రగుంట, జూన్ 17: మానవ హక్కుల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఏపీ చీఫ్ గంగన్న అన్నారు. బోగోలు మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలోని నెల్లూరు జిల్లా చీఫ్ దాసరి సునీల్ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన హ్యూమన్ రైట్స్ సభ్యులు దాసరి శివసాగర్ కుమార్, షకీలా, మల్లికార్జున, శ్రీనివాసులు, ఫణీరావు, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడి

● ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు


ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

కొండాపురం, జూన్ 17: మండలంలోని భీమవరప్పాడు ఎస్సీ కాలనీలో రెండు నెలల నుండి తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. పంచాయతీలో ప్రధాన గ్రామంతోపాటు ఎస్సీకాలనీ, మిట్టపాలెం హేబిటేషన్లు ఉన్నాయి. ఇందులో మిట్టపాలెం గ్రామానికి గతం నుండి స్థానిక ఉప్పుటేరు నుండి ప్రత్యేకంగా పైపులైనువేసి నీటి సరఫరా జరుగుతుండేది. ఇటీవల జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రధాన గ్రామంతోపాటు మిట్టపాలెం, ఎస్సీకాలనీ పైపులైన్లు వేసి నీటి సరఫరా చేస్తున్నారు. కాగా, ఒకే బోరు ద్వారా అన్ని కాలనీలకు నీరు సరఫరా జరుగుతుండటంతో ఎత్తున ఉండే వీధులకు నీరు అందడంలేదని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో నూతనంగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారు మోటార్లు పెట్టి నీటిని తోడుకోవడంతో తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. దీనిపై మండలస్థాయి నుండి జిల్లా అధికారులకు ఫిర్యాదుచేసినా రెండు నెలలనుండి తమ సమస్య తీరలేదన్నారు. దీంతో తామే నిధులు చెల్లించి ట్యాంకరు ద్వారా నీటిని తరలించుకుంటున్నామన్నారు. జలజీవన్ మిషన్ అమలులోకి వచ్చినప్పటి నుండి తమకు ఈసమస్య ఎదురైందని, ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో నీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్ల నిర్వహణ గాలికి !

● రాకపోకలకు తప్పని తిప్పలు


పైపులైన్ల మరమ్మతుల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

కావలి, జూన్ 17: కావలి పట్టణంలో మున్సిపాల్టీ అధికారులు రోడ్ల నిర్వహణను పట్టించుకోకుండా గాలికొదిలేశారు. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కావలి పట్టణం ఉదయగిరి ఆర్వోబీ అప్రోచ్ రోడ్డులో 17 రోజుల కిందట మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం సీసీ రోడ్డు పగులకొట్టి మరమ్మతులు చేశారు. అయితే ఆ రోడ్డులో ఉన్న గుంటను ఇప్పటికి పూడ్చకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి ఆ గుంట నిండా నీరు చేరింది. దీనివలన ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించటమే కాక నీరు చేరి ఉన్న ఆ గుంటతో ప్రమాదం పొంచిఉంది. అలాగే దానికి సమీపంలో చర్చి గేటు వద్ద రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉంది. అక్కడ కూడా రాకపోకలకు ఇబ్బంది కరమైన పరిస్థితి నెలకొంది. ఒక ప్రాంతంలో రెండు చోట్ల రాకపోకలకు ఇబ్బందికరంగా రోడ్డు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతోన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆ మార్గంలో రాకపోకలకు అనువుగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బక్రీద్ పండుగను కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లోని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు. కోవూరులోని గులేషావలి దర్గాలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కసుమూరులోని మస్తాన్ వలి దర్గాలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రార్థనలు జరిపారు.

మనుబోలు, జూన్ 17: మండల కేంద్రంలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. స్థానిక బీసీ కాలనీలోని ఉస్మానియా మసీదు, మనుబోలులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు కౌసర్ అల్లా ప్రవచనాలను చదివి, బక్రీద్ యొక్క విశిష్టతను తెలిపారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.

పొదలకూరు: త్యాగానికి ప్రతీకగా నిలిచే పండుగ పేరే బక్రీద్ అని పొదలకూరు ముస్లిం మతాధికారి మౌలానా ముస్తక్ మదని అన్నారు. స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కొందరు దాతలు ఈద్గాలో సిమెంటు బల్లలు వితరణ చేస్తామన్నారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


బక్రీద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూన్ 17: మైనార్టీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక గులేషావలి దర్గాలో సోమవారం ఆమె బక్రీదు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషిచేస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రంజాన్ మాసం రావడంతో నియోజకవర్గ పరిధిలోని మసీదు, దర్గాలను సందర్శించానన్నారు. తమ గెలుపు కోసం మైనార్టీ సోదరులు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, నాటకరాని వెంకట్, చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, గాదిరాజు చక్రవర్తి, మైనార్టీ నాయకులు సయ్యద్ నజీర్‌బాష, జమీర్ పాల్గొన్నారు.

కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో సోమిరెడ్డి పూజలు

వెంకటాచలం, జూన్ 17: కసుమూరు మస్తాన్‌వలి దర్గాను సోమవారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మస్తాన్ స్వామివారికి ఎమ్మెల్యే సోమిరెడ్డి దుప్పటి, పూలచాదర్ తదితర పూజ సామగ్రిని సమర్పించారు. అనంతరం దర్గా పూజారులు సోమిరెడ్డి పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ కసుమూరు దర్గాకు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు, దర్గా ముజావర్లు, స్థానిక నేతలు, తదితరులు ఉన్నారు. అలాగే బుల్లితెర హాస్య నటుడు, కిర్రాక్ ఆర్పీ కూడా దర్గాను దర్శించుకున్నారు.



వెంకటాచలం: మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కసుమూరు మస్తాన్‌వలి దర్గాలో పడమటి వాకిలి తెరిచి భక్తులను దర్శనానికి వదిలారు.

విడవలూరు : బక్రీద్ పండుగను ముదివర్తి, విడవలూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముదివర్తిలో మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె రఫి ఆధ్వర్యంలో మత పెద్దలు స్థానిక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అనీఫ్, అబ్దుల్లా, కమల్, అష్రాఫ్, గౌస్, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం: మండల ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా సైదాపురం, ఊటుకూరు, కలిచేడు, తూర్పు పూండ్ల, ఈద్గాల వద్ద ప్రత్యేక పార్థనలు చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంతోపాటు నగర పంచాయతీలో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. బుచ్చి పట్టణంలోని ఖాజానగర్ పెద్ద మసీదులో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకులు బచ్చా బాయ్, ఎస్కే పర్వీనా, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. ముందుగా బుచ్చి నగర పంచాయతీ, మండలంలోని ముస్లిం సోదరులందరికీ బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. అక్కడినుంచి కాశీపాళెం మసీదుకు వెళ్ళి ముస్లిం పెద్దల ఆశీస్సులు పొందారు. ఈకార్యక్రమంలో మైనారిటీ నాయకులు, హరికృష్ణ, ఎంపీ శేషయ్య, గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, రామానాయుడు, వెంకయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడవలూరు: బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలో యల్ల యపాళెం, నార్తు రాజుపాళెం, కొడవలూరు దర్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకు న్నారు.


విడవలూరు : బక్రీద్ వేడుకల్లో ముదివర్తి ముస్లిం యువత


పొదలకూరు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు


ప్రార్థనలు చేస్తున్న జియాఉల్ హక్, ముస్లింలు

అజీజ్ నివాసంలో బక్రీద్ వేడుకలు

● పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు


అజీజ్ నివాసంలో విందులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 17: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ నివాసంలో సోమవారం రాత్రి బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పలు వురు ఎమ్మెల్యేలు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నాయకులు తదితరు లు పాల్గొని బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి, నెల్లూరు రూరల్, ఉదయగిరి, కావలి, కోవూరు, కందుకూరు ఎ మ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కో టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఇంటూరి నాగేశ్వ రరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనా యుడు, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కు మార్ యాదవ్, నాయకులు కోటంరెడ్డి శ్రీని వాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో ప్రార్థనలు

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని చిన్నబజారులో ఉన్న మసీదు ఎ షహీన్షా ఖాజాపీర్ నెల్లూరు పెద్ద దర్గాలో బక్రీద్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి. బందవాజీ పీఠాధిపతు లు కేఎస్ఎస్, బాబాసాహెబ్ ఆధ్వర్యం లో ముస్లింలు దేశంలో శాంతి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు చేశారు. మజితే ఇమామ్ నవాజ్ చేయించారు. పీఠాధిపతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వితరణ

బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం మాజీ కార్పొరేటర్, 3వ డివిజన్ తెలుగుదేశం చైర్మన్ షేక్.బాషా సోమవారం బాలాజీనగర్ మసీదు సెంటర్‌లో 40 మంది పారిశుధ్య కార్మికులకు బక్రీద్ కానుకగా ఒక్కొక్కరికి కేజీ చొప్పున చికెన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు షేక్.షమీమ్, రాజా, షేక్.ఫిరోజ్, మల్లికార్జున, షేక్.ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(హరనాథ) : నగరంలోని ఖాదర్ నవాజ్‌కాన్‌పేట్ ఈద్గాలో బక్రీద్‌ను పురస్కరించుకొని సోమవారం రాష్ట్ర మైనార్టీ నాయకులు మొహ్మద్ జియాఉల్ హక్ ప్రార్థనలు నిర్వహించారు. ఆయనతో పాటు పలువురు నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌ను పునర్ వ్యవస్థీకరించండి

● మంత్రులను కోరిన అసోసియేషన్ నాయకులు


మంత్రి నారాయణను సన్మానిస్తున్న అసోషియేషన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 17: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను గత ప్రభుత్వం రెండు విభాగాలుగా విభజించడంతో సిబ్బంది అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునర్‌వ్యవస్థీకరించాలని, సెబ్‌ను తొలగించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుళ్ల, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ నాయకులు సోమవారం మంత్రులను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితో పాటు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, జిల్లాలోని శాసన సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ అధ్యక్షుడు ఎ.శీనయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌లు విభజించారన్నారు. సెబ్‌కు 70 శాతం మంది సిబ్బంది, ఎక్సైజ్‌కు 30 శాతం మంది సిబ్బందిని కేటాయించారని, అయితే సిబ్బంది కొరత వల్ల రెండు విభాగాల్లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. సెబ్‌ను తొలగించి సంపూర్ణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ కార్యదర్శి బి దయాకర్, ట్రెజరర్ ఎమ్ కిరణ్ సింగ్, సభ్యులు పి శివప్రసాద్, మస్తానయ్య, మునిశేఖర్ పాల్గొన్నారు.

నారాయణకు గజమాలతో సత్కారం

నెల్లూరు(వైద్యం): రాష్ట్ర పురపాలక శాఖమంత్రిగా పొంగూరు నారాయణ బాధ్యతలు చేపట్టి నెల్లూరుకు వచ్చిన సందర్భంగా సోమవారం బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు వై.రవి ఆధ్వర్యంలో మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయం గజమాల వేసి కిరీటం ధరింపజేసి సత్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పురపాలక శాఖమంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడం నెల్లూరు నగర ప్రజల అదృష్టమన్నారు. నగరంలో వైసీపీ ప్రభుత్వం ఆపేసి పెండింగ్‌లో ఉన్న పలు పనులకు మంత్రి శ్రీకారం చుడుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాలయ్య సైన్యం నేతలు శ్రీధర్, కేసీ కృష్ణ, మురళీమోహన్ రావు, శ్రీహరినాయుడు, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన యనమల

పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణను జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు యనమల నాగేశ్వరరావు, యనమల సునీల్‌కుమార్‌లు సోమవారం నారాయన నివాసంలో కలిశారు. శాలువా కప్పి, మొక్కను అందచేసి మంత్రిగా పదవి అలంకరించినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి ఆనంతో నారాయణ, ఎంపీ వేమిరెడ్డి భేటీ


మంత్రి ఆనంను కలిసిన మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో సోమవారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖా మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ కలిశారు. పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి, నారాయణలకు ఆనం పుష్పగుచ్ఛాలు అందచేసి సత్కరించారు.

విష్ణాలయంలో అన్నసంతర్పణ

మనుబోలు, జూన్ 17: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో సోమవారం నిర్వాహకులు భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెలా శుద్ధ ఏకాదశిరోజు ఆలయంలో ప్రత్యేకపూజలతో పాటు ఈ కార్యక్రమం చేపడతామన్నారు. స్వామి, దేవేర్లకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోపేతంగా పూజలు చేశారు. పూజలో ఉభయదాతలుగా ఏలూరు శ్రీధర్‌రెడ్డి, నీరజ దంపతులు వ్యవహరించారు.

ఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా తురకా ప్రసాద్ ఎన్నిక

పొదలకూరు/వెంకటాచలం, జూన్ 17 : ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అంకుపల్లి గ్రామానికి చెందిన తురకా ప్రసాద్ ఎన్నికైనట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కౌన్సిలింగ్ సమావేశం తాడేపల్లిగూడెంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభగిరిపట్నం గ్రామానికి చెందిన వి.గోపిని కోశాధికారిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ప్రసాద్ వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) చదువుతున్నాడు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఘర్షణ కేసు నిందితుల అరెస్టు

సైదాపురం, జూన్ 17: తూర్పుపూండ్ల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన కేసులో ఇద్దరు నిందితులు దుత్తలూరు శివకుమార్, గోగినేని రామయ్యలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. టీడీపీ విజయోత్సవ ర్యాలీలో అనంతరం డీజేకు డబ్బులు ఇస్తున్న సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సమయంలో వైసీపీ వర్గీయులు డీజేను దహనం చేసి, జనరేటర్ వాహనం అద్దాలు పగులకొట్టిన వైసీపీకి చెందిన 8మందిపై కేసు నమోదు చేశామన్నారు. వారిలో అరెస్టు చేశామన్నారు.

మంత్రి ఆనంను కలిసిన వంకి పెంచలయ్య

విడవలూరు, జూన్ 17: మండలంలోని చౌకచర్ల గ్రామానికి చెందిన ఆదిశంకరా కాలేజ్ చైర్మన్ వంకి పెంచలయ్య, టీడీపీ నాయకుడు ఓగు నాగేశ్వరరావు సోమవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. హిందూ దేవాలయాల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.



మండల సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే కురుగొండ్లకు సైదాపురం టీడీపీ నాయకుల వినతి


ఎమ్మెల్యేను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సైదాపురం, జూన్ 17: మండల టీడీపీ నాయకులు సోమవారం వెంకటగిరికి వెళ్లి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి మాట్లాడారు. మండల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ పెమ్మసాని దిలీప్ చౌదరి, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రమణ్యం రాజు, జోగిపల్లి సర్పంచు గుంటమడుగు కృష్ణంరాజు, కేపీ రాజు, మేకల కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మందిపాటి అభినందనలు


వేమిరెడ్డితో ప్రవీణ్ కుమార్‌రెడ్డి

కొడవలూరు, జూన్ 17 : నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నార్తురాజుపాళెం గ్రామ నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కరకటి మల్లికార్జున, మందిపాటి రమణారెడ్డి, పోశం దిలీప్‌కుమార్‌రెడ్డి, మయూరి, తదితరులు ఉన్నారు.

టీ-10 టోర్నీ విజేత మనుబోలు జట్లు



విజేత జట్లతో సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మనుబోలు, జూన్ 17: సమ్మర్ టీ టెన్ మండలస్థాయి టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ సోమవారం జరిగింది. ఉదయం రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లలో మనుబోలు మెయిన్ టీం, మనుబోలు గ్రౌండ్ టీం విజేత కావడంతో వీరిద్దరి మధ్య ఫైనల్ మ్యాచ్ జరగాల్సిఉంది. మధ్యాహ్నం వర్షం రావడంతో ఆర్గనైజర్లు ఫైనల్ మ్యాచ్ రద్దుచేసి సంయుక్త విన్నర్లుగా ప్రకటించారు. మనుబోలు మెయిన్ టీం కెప్టెన్ శ్రీనువాసులు, గ్రౌండ్ టీం కెప్టెన్ సాయిమోహన్‌కు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేతులమీదుగా ట్రోఫీ, రూ.25వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. క్రీడా మైదానానికి పూర్వవైభవం తీసుకవస్తామన్నారు. ప్రతిఏటా తాను ఓ టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులకు సహకరిస్తామన్నారు. యూత్‌క్లబ్, మైదానంను స్టేడియంలా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. టోర్నమెంట్ దాతలు హరికృష్ణారెడ్డి, రామ్మోహన్, మిగతా వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేరెడ్డి రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాజాగౌడ్, జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఆర్గనైజర్లు సాయి, శ్రీను పాల్గొన్నారు.

శోభన్‌బాబు ప్యానల్ ఘన విజయం


ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 17 : నగరంలోని ఆర్య వైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ జరిగిన ఎన్నికల్లో కొనగళ్ల శోభన్‌బాబు (ఏఎంఆర్) ప్యానల్ ఘన విజయం సాధించింది. ఆదివారం రంగనాయకులపేటలోని అసోసియేషన్ కళ్యాణ మండపంలో పోలింగ్ జరిగింది. అర్ధరాత్రి తర్వాత ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. మొత్తం 33 మంది కమిటీ సభ్యుల ఎంపికకు అసోసియేషన్‌లోని 403 మందికి 393 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొనగళ్ల శోభన్‌బాబుకు సంబంధించిన ఏఎంఆర్ ప్యానల్‌లో 17 మంది విజయం సాధించగా ప్రత్యర్థిగా పోటీ చేసిన ఎంపీ అంజనేయులు మాతా కన్యకాపరమేశ్వరి ప్యానల్‌కు చెందిన 16 మంది విజయం సాధించారు. దీంతో కొనగళ్ల శోభన్‌బాబు ప్యానల్ ఎన్నికైనట్లు ఎన్నికల పర్యవేక్షకుడైన న్యాయవాది వీపీ మల్లికార్జున్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గంలో అసోసియేషన్ అధ్యక్షుడుగా కొనగళ్ల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా అరవేటి ఫణీంద్రకుమార్, కోశాధికారిగా భోగనాథం సుబ్రహ్మణ్యంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తిరువీధి వెంకటకిషోర్‌కుమార్, అమరా శివ, పువ్వాడ వెంకట రమేష్‌బాబు, సహకార్యదర్శిలుగా చంద్రాలు, సతీష్‌కుమార్, తులసి, వెంకటసురేంద్ర, నగేష్‌కుమార్‌లు బ్యాలెట్ ద్వారా ఎన్నికయ్యారు. విజేతలు తమ విజయానికి సూచకంగా పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి అభిమానులతో ఊరేగింపు నిర్వహించారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి నారా లోకేష్‌కు జేఏసీ నేతల వినతి

నెల్లూరు(విద్య), జూన్ 17: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్స్ సమస్యలను పరిష్కరించాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నేతలు కోరారు. సోమవారం ఉండవల్లిలో మానవవనరులు, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జేఏసీ కో-చైర్మన్ కల్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారుల తొలి సమీక్షలోనే ఇంటర్ విద్యపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని పునరుద్ధరించడంతో పాటు నోట్ పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ ప్రకియ చివరి దశకు చేరించీజూట, ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై మంత్రి రెగ్యులరైజేషన్, రెన్యువల్‌కు సంబంధించిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, నేతలు వీరయ్య పాల్గొన్నారు.

'నారాయణ'లో ఫాస్ట్‌ట్రాక్ సేవలు ప్రారంభం

నెల్లూరు(వైద్యం), జూన్ 17 : నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఫాస్ట్‌ట్రాక్ ఎమర్జెన్సీ వైద్య సేవలను సోమవారం ప్రారంభించారు. ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, ఆపరేషన్స్ హెడ్ రామారావులు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా నారాయణ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ ఎమర్జెన్సీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఫాస్ట్‌ట్రాక్ ద్వారా రోగులు వచ్చిన గంటలోపే ముఖ్యమైన వైద్య పరీక్షలు చేసేందుకు ఎంతో అనుభవజ్ఞులైన టెక్నీషియన్‌లు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఆపరేషన్స్ హెడ్ రామారావు మాట్లాడుతూ అత్యవసర సమయంలో చేయాల్సిన అన్ని రకాల వైద్య చికిత్సలు దీని ద్వారా అందుబాటులోకి తీసుకు వచ్చామని తెలిపారు. ఈ ఎమర్జెన్సీ వైద్య సేవల కోసం 9037104108 నెంబరును సంప్రదించాలని ఆసుపత్రి ఏజీఎం శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరులో పర్యటించిన జేసీఐ ఇండియా జాతీయ అధ్యక్షుడు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 17 : జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అధ్యక్షుడు రికేష్ శర్మ తన అఫిషియల్ విజిట్‌కి సోమవారం నెల్లూరు వచ్చారు. జేసీఐ నెల్లూరు, నెల్లూరు ఏంజెల్స్ జేసీ నెల్లూరు క్లబ్ సభ్యులను నగరంలోని హోటల్ యష్ పార్కులో కలుసుకున్నారు. నెల్లూరు క్లబ్‌లో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను పరిశీలించారు. జేసీఐ ఆర్గనైజేషన్ ఆశయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జేసీఐ నాయకులు సమక్షంలో 90 సార్లు రక్తదానం చసిన సతీష్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ డైరెక్టర్ కోట సత్యనారాయణ, జోన్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, మనోజ్, విష్ణు, సాయి, పొత్తూరి అఖిలారెడ్డి, తవ్వా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కళాకారులు, వాకర్స్ వేడుకలు

నెల్లూరు(వైద్యం), జూన్ 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రిగా పొంగూరు నారాయణ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం నగరంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో టీడీపీ కళాకారులు, వాకర్స్ వేడుకలు జరుపుకున్నారు. వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడకలలో చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. 15 అడుగుల నారాయణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేతలు పెంచలనాయుడు, పాముల రమణయ్య, శివప్రసాద్‌నాయుడు, గుండు సుబ్రహ్మణ్యం, రాముల నాయుడు, రాజా రవీంద్ర, కళాంజలి శ్రీనివాసులు, బాబు, వెంకటేశ్వర్లు దయాకర్, హరనాథరెడ్డి, కరాటే మాస్టర్, శ్రీనివాస్, చిన్నారులు పాల్గొన్నారు.

నాదెండ్లను కలిసిన టోనిబాబు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 17: జనసేన పార్టీ నాయకుడు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను గుంటూరులోని ఆయన స్వగృహంలో సోమవారం పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టోనిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టోనిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేనను విజయ పథంలో నడిపించినందుకు నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపామన్నారు.

అర్చకులకు అండగా ఉంటాం

● కమలానందభారతి


కమలానందభారతితో అర్చక సమాఖ్య నాయకులు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 17 : నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అర్చకుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయడమే కాక, అర్చకులకు అండగా ఉంటామని కమలానందభారతీ స్వామి అర్చకులకు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన నెల్లూరు బాబా నగర్ విడిది కేంద్రంలో అర్చక సమాఖ్య నాయకులు పీఏపీ ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ తదితరులు స్వామివారిని కలిసి అర్చకుల సమస్యలు వివరించారు. అర్చకుల జీతభత్యాలు, వేద పండితులు నియామకం, దేవాలయాల నిర్వహణ లాంటి అంశాలలో సమస్యలను స్వామీజీ దృష్టికి తీసుకెళ్లారు. వేదం చదువుకొన్న వారికి మంచి భవిష్యత్ ఉండే విధంగా ప్రోత్సహించడంతో పాటు సంస్కృత భాష అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని స్వామీజీ తెలిపారు.

వర్శిటీల్లో గందరగోళం

కీలక పదవుల్లోని అధికారులపై ఆరోపణలు

వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు

ప్రభుత్వం మారడంతో పలువురి రాజీనామా

పదవుల్లో కొనసాగేందుకు కొందరి యత్నాలు

తప్పుకోమంటూ ఆందోళనలకు దిగుతున్న టీడీపీ వర్గాలు

ఎస్వీయూ నుంచీ ద్రవిడ వర్శిటీ దాకా ఇదే పరిస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. కీలక పదవుల్లోని వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ వంటి అధికారులపై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. మొన్నటి దాకా వైసీపీ నేతల అండతో ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. కొన్ని అంశాలు హైకోర్టు దాకా వెళ్ళి విచారణలు పెండింగులో వున్నాయి. ఇపుడు ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో హడావిడిగా పలువురు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరేమో పదవుల్లో కొనసాగేందుకు టీడీపీ నేతలను ఆశ్రయించే ప్రయత్నాల్లో వున్నారు. రాజీనామాలు చేయని వారిని తప్పుకోమంటూ టీడీపీ వర్గాలు ఆందోళనలకు దిగుతున్నాయి.తిరుపతి ఎస్వీయూ నుంచీ కుప్పంలోని ద్రవిడ వర్శిటీ దాకా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు నిలయంగా మారిన వర్శిటీలు ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రక్షాళనకు గురవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ద్రవిడ వర్శిటీలో ముగ్గురి రాజీనామా



కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా ప్రభుత్వం మారగానే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రిజిస్ట్రార్ వేణుగోపాల రెడ్డి, రెక్టార్ అనురాధ, అకడమిక్ డీన్ శ్రీనివాసకుమార్ రాజీనామా చేశారు. అయితే రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. ఇక్కడ వీసీ మధుజ్యోతి గత డిసెంబరులో నియమితులయ్యారు. ఆమెపై ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వర్శిటీని గాడిలో పెట్టలేక పోయారన్న విమర్శలను మూటగట్టుకున్నారు. వర్శిటీలో పనిచేస్తున్న సుమారు 240మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11 నెలలుగా వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఆమె బాధ్యతలు తీసుకున్నాక కూడా వేతనాలు చెల్లింపులు జరగడం లేదు. రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్న వేణుగోపాల్‌రెడ్డిపై అనేక ఆరోపణలున్నాయి. ప్రభుత్వానికి కూడా పెద్ద ఎత్తున ఫిర్యాదులందాయి. కొన్ని కేసులు హైకోర్టులో కూడా పెండింగులో వున్నాయి. ఎవరు వీసీగా నియమితులైనా వర్శిటీలో పెత్తనం మాత్రం వేణుగోపాల్‌రెడ్డిదేనన్న ఆరోపణలున్నాయి.అసలు ఆయన నియామకమే అక్రమమని కొందరు హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణ పెండింగులో వుండగానే అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచీ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారన్న ఫిర్యాదులూ ప్రభుత్వానికి వెళ్ళాయి. ప్రచురణల విభాగంలో 2011 నుంచీ పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి 2021లో టీచర్లుగా పదోన్నతి కల్పించడంపైనా, వారికి 2011 నుంచీ అరియర్స్ చెల్లింపులు జరపడం మీదా ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్ళాయి. లబ్ధిదారుల్లో ఇదివరకటి చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి సన్నిహిత బంధువు వుండడంతో ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించలేదన్న ఆరోపణలున్నాయి.స్టడీ సెంటర్లు మూతపడడంతో వర్శిటీకి ఆదాయం పడిపోయిందని, చివరికి ఫిక్సెడ్ డిపాజిట్లు కూడా డ్రా చేసి ఖర్చు పెట్టేశారని సమాచారం. ఏటా ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కూడా వర్శిటీ నిర్వహణకు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం మారడంతో అక్రమాలకు పాల్పడిన అధికారులు హడావిడిగా తప్పుకునేందుకు యత్నిస్తున్నారు.

కొనసాగేందుకు వీసీ యత్నాలు

ద్రవిడ వర్శిటీ వీసీగా వున్న మధుజ్యోతి తండ్రి కొలకలూరి ఇనాక్ ప్రముఖ రచయిత, విద్యావేత్త. గతంలో ఎస్వీయూ వీసీగా కూడా పనిచేశారు.ఆయన తొలుత టీడీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వుండి ఎస్వీయూ వీసీగా పదవి పొందారు. తర్వాత వైసీపీ వైపు మొగ్గు చూపినట్టు ప్రచారం జరిగింది. 2014లో ఆయన మరో కుమార్తె ఆశాజ్యోతి చిత్తూరు ఎంపీగా వైసీపీ టికెట్ కోసం గట్టిగా యత్నించారు. చివరి క్షణంలో అవకాశం తప్పిపోయింది. గతేడాది డిసెంబరులో మరో కుమార్తె మధుజ్యోతి ద్రవిడ వర్శిటీ వీసీగా నియమితులయ్యారు. ఇపుడు ప్రభుత్వం మారడంతో సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని ఆ వర్గ ప్రముఖుల ద్వారా మళ్ళీ టీడీపీ ప్రభుత్వ మద్దతుతో వీసీగా కొనసాగేందుకు ఆమె కుటుంబం ప్రయత్నిస్తోందని సమాచారం. అందుకే రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు రాజీనామాలు చేసినా వీసీ మధుజ్యోతి మాత్రం రాజీనామా చేయలేదని వర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

ఎస్వీయూలో పరిస్థితి అస్తవ్యస్తం



ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి ఛాంబర్‌లో ఇటీవల తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బైఠాయించి మరీ ఆయన్ను పదవి నుంచీ తప్పుకోవాలని డిమాండ్ చేయడం కలకలం సృష్టించింది. ఓ విశ్వవిద్యాలయ వీసీకి తన అధికారిక ఛాంబర్‌లో ఈ తరహా అనుభవం ఎదురు కావడం నిస్సందేహంగా అభ్యంతరకరం, అనైతికం కూడా. అయితే ఈ పరిస్థితి ఏర్పడడానికి దారి తీసిన కారణాలేమిటన్నది లోతుగా తరచి చూడాల్సి వుంది. తక్షణ కారణం ఏమిటంటే 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ మద్దతుదారులు నాటి ఎస్వీయూ వీసీ రాజేంద్రప్రసాద్ ఛాంబర్‌లోకి, చివరికి ఆయన బంగ్లాలోకి కూడా చొరబడి పదవి నుంచీ తప్పుకోవాలని గొడవకు దిగారు. ఫోన్లు చేసి మరీ దుర్భాషలాడారు. దీంతో ఆయన తీవ్ర మనోవేదనతో వీసీ పదవి నుంచీ తప్పుకుని వెళ్ళిపోవాల్సి వచ్చింది. వర్శిటీ చరిత్రలో ఏనాడూ లేని ఈ తరహా అనైతిక వర్తనను, అవాంఛనీయ సాంప్రదాయాన్ని ఐదేళ్ళ కిందట వైసీపీ వర్గీయులే ప్రారంభించారు. ఇపుడు టీడీపీ వర్గీయులు దానికి ప్రతీకారం తీర్చుకునే రీతిలో అదే తరహా నిరసనలకు దిగుతున్నారు. ఇది తక్షణ కారణమే కానీ ఎస్వీయూ పాలనా వ్యవహారాల్లో అనేక అడ్డగోలు నిర్ణయాలు జరిగాయనేది అసలైన కారణం. ప్రస్తుత వీసీ శ్రీకాంత్‌రెడ్డి గతేడాది డిసెంబరులో నియమితులయ్యారు. ఆయన పీలేరు నియోజకవర్గం కలకడ మండలానికి చెందిన పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. ఆయన కుటుంబం రాజకీయంగా అటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఇటు మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కూడా సన్నిహితంగా వుంటోంది. గత డిసెంబరులో మంత్రి పెద్దిరెడ్డి సిఫారసుతోనే వీసీ పదవిలో నియమితులయ్యారు. అప్పటి నుంచీ మంత్రి సిఫారసుతో సుమారు వంద దాకా తాత్కాలిక ఉద్యోగాలు భర్తీ చేశారన్న ఆరోపణలున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్ల ఉద్యోగ కాలపరిమితిని 89 రోజుల నుంచీ 11 నెలలకు పొడిగించడం కూడా వివాదాస్పదమైంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా మునుపటి తేదీ వేసి 13మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈనెల 4న ఓట్ల లెక్కింపు ఫలితాల్లో టీడీపీ అధికారంలోకి రావడం స్పష్టం కాగానే ఎస్వీయూ రిజిస్ట్రార్ హుస్సేన్ అదే రోజు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మూడేళ్ళ కిందట అప్పటి రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సిఫారసుతో రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి కూడా తప్పుకుంటారని టీడీపీ వర్గీయులు భావించారు. అయితే శ్రీకాంత్‌రెడ్డి కుటుంబానికి మాజీ సీఎం నల్లారి కిరణ్, ఆయన సోదరుడు నల్లారి కిషోర్‌లతో సన్నిహిత సంబంధాలున్న కారణంగా వారి సిఫారసుతో పదవిలో కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే టీడీపీ వర్గీయులు గట్టిగా పట్టుబడుతున్నా, చివరికి ఛాంబర్‌లోకి వెళ్ళి బైఠాయించి మరీ నిరసనలు వ్యక్తం చేస్తున్నా వీసీ స్పందించడం లేదని సమాచారం.

వెటర్నరీ వర్శిటీలో కోడ్ ఉల్లంఘనలు



తిరుపతిలోని వెటర్నరీ వర్శిటీలో ఎన్నికల కోడ్ అమల్లో వుండగానే ఉల్లంఘించి మరీ నియామకం జరిగింది.డైరెక్టర్ ఆఫ్ రీసెర్చి పోస్టు ఖాళీ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరు వెటర్నరీ కాలేజీకి చెందిన పేథాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా వున్న ప్రొఫెసర్ శ్రీలతను నియమించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక జరిగిన ఈ నియామకం వాస్తవానికి ఏపీ సీఈవో నుంచీ అనుమతి తీసుకున్నాక చేపట్టాల్సి వుంది. అయితే సీఈవో లేదా ఈసీ అనుమతి లేకుండానే రిజిస్ట్రార్ తాత్కాలిక ప్రాతిపదికన నియామకం జరిపారు.తాత్కాలిక నియామకమైనా ఈసీ ముందస్తు అనుమతి తప్పనిసరి. వర్శిటీ పాలకవర్గం అనుమతి కూడా లేదు. దానికి తోడు తాత్కాలిక నియామకం కాల పరిమితి మూడు నెలలు మాత్రమే. అయితే ఏకంగా ఆరు నెలల కాలపరిమితితో ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇపుడు ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం ఏమవుతుందోనని, కోడ్ ఉల్లంఘించి నియామకం జరిపిన అధికారులపై ఎలాంటి చర్యలు వుంటాయోనన్న చర్చ వర్శిటీలో జోరుగా నడుస్తోంది.

మహిళా వర్శిటీలో వీసీ కొనసాగే అవకాశం



పద్మావతీ మహిళా వర్శిటీ వీసీ భారతి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరోపణలు లేకపోవడానికి తోడు బలిజ సామాజికవర్గానికి చెందిన ఈమెకు ఆ సామాజిక వర్గం అండదండలు లభించే పరిస్థితి నెలకొంది. సౌమ్యురాలుగా, వివాద రహితురాలుగా పేరుండడంతో కొనసాగింపు సమస్య కాబోదని సమాచారం. రిజిస్ట్రార్ రజని మాత్రం కొనసాగే పరిస్థితులు కనిపించడం లేదు.



రుయాస్పత్రిలోని వసతులపై పేషెంటుతో మాట్లాడుతున్న సత్యకుమార్

ప్రభుత్వాస్పత్రుల్లో వసతుల కల్పనకు పెద్దపీట

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి(వైద్యం), జూన్ 17 : నిరుపేదలకు కార్పొరేటు స్థాయి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చెప్పారు.తిరుపతిలోని రుయాస్పత్రిని ఆయన సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. అత్యవసర విభాగంలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారి వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాక వివరాలను సూపరింటెండెంట్ రవిప్రభును అడిగి తెలుసుకున్నారు.ఓపీ కేంద్రానికి వెళ్లి క్యూలో వున్న రోగులతో మాట్లాడి ఓపీ స్లిప్పులను పరిశీలించారు. మెడిసిన్ వార్డులో రోగులతో పాటు వారి సహాయకులతో కూడా మాట్లాడారు.వార్డుల్లో నీటి సమస్య వుందని రోగులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రేడియాలజీ విభాగంలో సరైన వసతులు లేకపోవడాన్ని గుర్తించి మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులతో ఆస్పత్రి పరిస్థితిపై సమీక్షించారు.గత ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ సేవలను అందించాలని కొంత మంది వైద్యులనే నియమించిందని, వైద్య పరికరాలు, గదుల కొరత ఉందని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, సూపరింటెండెంట్ రవిప్రభు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వీలైనంత త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి హామీ ఇచ్చారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్బారావు, సీఎస్ఆర్ఎంవో లక్ష్మానాయక్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేతలు భానుప్రకాష్‌రెడ్డి,సామంచి శ్రీనివాస్ , శ్రీహరిరావు, సుబ్రహ్మణ్య యాదవ్, చిట్టిబాబు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సెలవు పొడిగించండి

సీఎస్‌కు ధర్మారెడ్డి అభ్యర్థన

తిరుమల, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరు వరకు తనకు సెలవు పొడిగించాలని టీటీడీ అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు లేఖ పంపారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడులైన రెండు రోజుల తరువాత ధర్మారెడ్డి తనకు సెలవు మంజూరు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం తిరుమల పర్యటనకు ముందు 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏడు రోజుల పాటు రాష్ట్రప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన ఈవోగా శ్యామలరావును నియమించింది.ఈవో బాధ్యతలను ఆయనకు అప్పగించిన ధర్మారెడ్డి తనకు 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు లీవ్ కావాలంటూ సీఎస్‌కు లేఖలో విన్నవించుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన పదవీవిరమణ చేయబోతున్న విషయం తెలిసిందే.

3.10లక్షలమంది 'పీఎం కిసాన్' లబ్ధిదారులకు నేడు నగదు జమ

తిరుపతి, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏటా రైతులకు మూడు సార్లు అందించే ఆర్థికసాయం మంగళవారం రెండవసారి అందనుంది.చిత్తూరు జిల్లాలో 1.75లక్షలమంది రైతులకు రూ.35కోట్లు, తిరుపతి జిల్లాలో 1.35లక్షలమంది రైతులకు 27.08కోట్లు ఖరీఫ్ పెట్టుబడి సాయం వారివారి బ్యాంకు ఖాతాల్లో జమకానుంది.

కిలో టమోటా రూ.56.70

పుంగనూరు, జూన్ 17 : చిత్తూరు జిల్లా పుంగనూరు మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.56.70 పలికింది. ముస్లింల పర్వదినం బక్రీద్ సందర్భంగా డిమాండు పెరిగింది. దీంతో ఆదివారం కిలో టమోటా ధర రూ.49.40 ఉండగా.. సోమవారానికి రూ.56.70కి చేరింది. రెండో రకం కిలో రూ. 53.40, మూడో రకం రూ.48 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలుచేశారు. పుంగనూరు మార్కెట్‌కు రైతులు 340.99 టన్నుల టమోటాలు తీసుకొచ్చారు.



తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఎదురుగా,ఎయిర్ బైపాస్ రోడ్డులో, ఎమ్మార్ పల్లి పంచాయతీ ఆఫీసు పక్కన,ఈఎస్ఐ ఆస్పత్రి పక్కన అన్న క్యాంటీన్ భవనాల్లో వెలసిన హోటళ్లు

మూడు నెలల్లో అన్న క్యాంటీన్లు

పునఃప్రారంభానికి ముమ్మర ఏర్పాట్లు

తిరుపతిలో వైసీపీ నేతల చేతుల్లో క్యాంటీన్ల భవనాలు

వాటిలో ఖరీదైన హోటళ్ళు, కేఫ్‌లు ఏర్పాటు

తిరుపతి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అన్నార్తుల కడుపు నింపే అన్నా క్యాంటీన్లు మళ్లీ ప్రారంభం కానున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018నుంచి దశలవారీగా జిల్లాలో పది చోట్ల అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతూ వచ్చారు. పేదలు, చిరుద్యోగులు, అసంఘటిత కార్మికులకు ఆసరాగా నిలిచిన అన్న క్యాంటీన్లు వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే మూతపడ్డాయి. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చిన గడువు పూర్తయిందని, మళ్లీ ప్రారంభిస్తామని ప్రభుత్వ పెద్దలు కథలు చెప్పారు. అన్న కాంటీన్ల భవనాలకున్న పసుపు రంగును మార్చి తెలుపు రంగు వేశారు. 'అన్న' పేరును తీసేశారు. ప్రజల మన్ననలు పొందిన ఈ పథకాన్ని నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వినిపించినా ప్రభుత్వం పట్టించుకోలేదు.మళ్లీ చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రోజే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యాచరణకు యంత్రాంగం సిద్ధమైంది.సెప్టెంబరు 21లోపు జిల్లావ్యాప్తంగా ఉన్న 10 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు సంబంధించి ఆయా మున్సిపాల్టీల కమిషనర్లతో పాటు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు చర్యలు తీసుకోవాల్సివుంటుంది. క్షేత్రస్థాయిలోని అన్న క్యాంటీన్ల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, వాటిని వినియోగంలోకి తెచ్చుకునే దిశగా కసరత్తు జరగనుంది.

ఖరీదైన హోటళ్లుగా మారిన క్యాంటీన్లు

జిల్లాలో దాదాపు 10 అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేయగా తిరుపతిలోనే 4 ప్రారంభించారు. స్విమ్స్ సర్కిల్లో ఒకటి, ఎమ్మార్ సర్కిల్ సమీపంలో రెండు, ఈఎస్ఐ ఆస్పత్రి ఎదుట మరొక క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటైన అన్న క్యాంటీన్లపై నేతల కన్ను పడింది. అన్న క్యాంటీన్లను అద్దెకు ఇవ్వాలని కౌన్సిల్లో తీర్మానం చేసి అనుచరులకు కట్టబెట్టేశారు. నామమాత్రపు అద్దెతో అవన్నీ ఖరీదైన హోటళ్లుగా మారిపోయాయి. తిరుపతిలో వైసీపీ యువనేత ఆదేశాల మేరకు ఏ ప్రాంతంలో ఉండే అన్న క్యాంటీన్లను ఆయా ప్రాంతాల్లోని వైసీపీ నేతలకు కట్టబెట్టేశారు.

పలు చోట్ల సచివాలయాలుగా

పలు చోట్ల ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లు సచివాలయాలు, హెల్త్‌క్లినిక్‌లుగా మారాయి. శ్రీకాళహస్తిలోని రెండు అన్న క్యాంటీన్లలో ఒకటి సచివాలయంగా, మరొకటి ప్రెస్‌క్లబ్‌గా మారింది. గూడూరులోని అన్న క్యాంటీన్ సచివాలయంగా కొనసాగుతోంది. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద క్యాంటీన్ భవనంలో సచివాలయ సేవలందుతున్నాయి. సూళ్లూరుపేటలోని అన్న క్యాంటీన్ పట్టణ ఆరోగ్య కేంద్రంగా మారింది. వెంకటగిరిలోని అన్న క్యాంటీన్‌ను సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి వినియోగిస్తూ వచ్చారు. గత శనివారం ఎమ్మెల్యే రామకృష్ణ మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు.ఇప్పటివరకూ ప్రజా విజ్ఞప్తుల కోసం వినియోగిస్తూ వస్తున్న ఈ భవనంలోని కుర్చీలు, టేబుల్ తొలగించారు. అన్నక్యాంటీన్ నిర్వహణకు అనుకూలంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

చెంబేడు రిజర్వాయర్ కల నెరవేరేనా?

ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటని నిర్మాణం ● సీఎం చంద్రబాబుపైనే రైతుల ఆశలు

పెళ్లకూరు, జూన్ 17: మండలంలోని 15 గ్రామాలకు తాగు, సాగునీటిని అందించడానికి నిర్దేశించిన చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణం కలగానే మిగిలింది. ఏళ్ల తరబడి ప్రతిపాదన దశ దాటని సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నీరు - చెట్టు పథకం పలు వంట కాలువలను, నష్టి చానళ్లను, చెరువులను అభివృద్ధి చేసింది. అయితే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయలేదు.

పెళ్లకూరు మండలంలోని 74 చిన్న, పెద్ద చెరువుల్లో తలమానికం చెంబేడు చెరువు. సుమారు 832.90 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు నుంచి నందిమాల, చెన్నప్పనాయుడుపేట, ఆజాకావారికండ్రిగ, నల్లగుంట కండ్రిగ, అర్ధమాల, ఉమ్మలగుంట, వడ్డిపాలెం, మారనేనిపాలెం, అర్ధపాడు పరిధిలో సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు, 20వేల మందికి నీరు అందుతోంది. ఈ క్రమంలో 2014లో టీడీపీ అధికారం చేపట్టాక చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు కాలేదు.

జగన్ పాదయాత్ర హామీ తూచ్...

ఈ క్రమంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్.. 2018 జనవరి 23న మండలంలో పాదయాత్ర నిర్వహించారు. ఆ సమయంలో నాయకులతో పాటు రైతులు చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాల్సిందిగా జగన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారుస్తామంటూ హామీ ఇచ్చారు. ఆ తరువాత 2021లో రూ.31 కోట్లతో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలు బుట్ట దాఖలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఆయకట్టు రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గంలో ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణకు మంత్రులుగా స్థానం దక్కడం.. మంత్రులతో మండల టీడీపీ నేతలకు సత్సంబంధాలు ఉండడంతో వనుల్లో కదలిక రావచ్చని గ్రామీణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్వర్ణముఖినది ఆయకట్టు మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ... 2014లో చెంబేడు రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినాం, అనివార్య కారణాలతో నిధులు మంజూరు కాలేదన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రిజర్వాయర్ మార్చి 15 గ్రామాల పొలాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నంది కృష్ణయ్య మాట్లాడుతూ... చెంబేడు చెరువు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఈ ప్రాంత ప్రజలను ఆదుకుంటామన్నారు.


చెంబేడు చెరువు

శాలువా కప్పినంత మాత్రాన పార్టీలో చేర్చుకున్నట్టుకాదు: ఎమ్మెల్యే కురుగొండ్ల


కురుగొండ్లకు సత్కరిస్తున్న వైసీపీ నాయకుడు

దక్కిలి, జూన్ 17: ఎన్నికలకు ఒక్కరోజు ముందు వచ్చి పార్టీకి పనిచేసిన వారే తన వారని ఎన్నికల త ర్వాత వచ్చి గుంపులో చేరి శాలువా కప్పినంత మాత్రాన వారిని పార్టీలో చేర్చుకున్నట్టు కాదని అలాంటి వారు ఉన్నారని గ్రహించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పెంచలకోన పర్యటనకు వచ్చిన ఆయనకు టీడీపీ నాయకులతో పాటు కొంత మంది వైసీపీ నాయకులు కూడా శాలువాలతో సత్కరించారు. దీంతో స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ నాయకులను పార్టీలో చేర్చుకున్నట్టు అర్థమని వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులకు, కార్యకర్తలకు తాను అన్ని విధాలా అండగా ఉంటానని చెప్పారు. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారని ఆ దిశగా పరిస్థితుల్లో జరగదన్నారు. కాగా సోమవారం వైసీపీకి చెందిన దక్కిలి మండలం లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు వేముల రాజమోహన్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోటి ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పడంతో ఆ యన పై విధంగా వ్యాఖ్యానించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఉన్నంతలో కొంత దానం చేయండి

బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో నెలవల పిలుపు


జామియా మసీదులో నెలవలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఫీ తదితరులు

నాయుడుపేట, జూన్ 17: అల్లా మనకు ఇచ్చిన దానిలో కొంత లేనివారికి దానం చేయడం ద్వారా ఆ కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్, పార్థసారథి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఇక బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జామియా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. జామియా మసీదు, నూర్‌మసీద్, మక్కా మసీదుల్లో ఈద్గాలో పెద్దల దర్గాలో ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా హాజీలు మాట్లాడుతూ... బక్రీద్ పర్వదినం త్యాగానికి ప్రతీక అని ప్రతి ఒక్కరు పరస్పరం సాయం చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి దళ అర్చన



సూళ్లూరుపేట, జూన్ 17: పట్టణంలోని మన్నేంకులమ్మూర్తి స్వామి ఆలయంలో జ్యేష్ఠ ఏకాదశి సందర్భంగా సోమవారం స్వామివారికి లక్ష తులసి దళ అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ లక్ష తులసి దళ అర్చన వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనందకుమార్ పాల్గొనగా ట్రస్టు నిర్వాహకుడు బిరాబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పవన్‌కల్యాణ్ గెలవడంతో తిరుమలకు పాదయాత్ర

గూడూరు అర్బన్, జూన్ 17: సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం కావడంతో ఆయన అభిమాని, జనసేన కార్యకర్త తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. పవన్ గెలిచి కూటమి అధికారంలోకి వస్తే తిరుమలకు పాదయాత్రగా వచ్చి శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కు కున్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక కోదండరామాలయ సన్నిధి ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభించి తరలివెళ్లారు.

సరస్వతి శిశు మందిరంలో నాణ్యమైన విద్యాబోధన

గూడూరు అర్బన్, జూన్ 17: పట్టణంలోని పూలతోటలో ఉన్న సరస్వతి శిశుమందిర పాఠశాలలో నామమాత్రపు ఫీజులతో, నాణ్యమైన, విలువలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నారని డాక్టర్ జనార్దన రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తే ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యాబోధన ఉంటుందన్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బారావు, ఎస్‌ఎస్‌వీఎస్‌స్వామి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కృష్ణ, రామ్మోహన్, రంగనా తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న సెర్ప్ ప్రతినిధులు

కోట, జూన్ 17: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం సెర్ప్ ప్రతినిధులు ఆడిట్ నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వెలుగు కార్యాలయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సెర్ప్ ప్రతినిధి లైల నరసింహారావు, వీరేంద్ర నాథ్ ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించిన పలు సంఘాలకు సంబంధించిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీకాంత్, ప్రసాద్, భాస్కర్, శంకరయ్య, కృష్ణమ్మ, బిందు, తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల అసోసియేషన్ ఎన్నికలు


నూతన కార్యవర్గ అభినందన సభ

కోట, జూన్ 17: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగుల అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పర్సన్ విత్ డిజేబుల్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం, మురళీగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. కోట మండల అధ్యక్షుడిగా ఐకృష్ణ, ఉపాధ్యక్షుడిగా వి.సుధీర్, మహిళా అధ్యక్షురాలిగా చెల్లమ్మ, కార్యదర్శిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా శ్రీనివాసులు, జాయింట్ కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులచేత పీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు.

కూటమితోనే అభివృద్ధి


వివరాలు వెల్లడిస్తున్న వరప్రసాద రావు

వాకాడు, జూన్ 17: కూటమితోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు వరప్రసాదరావు అన్నారు. మండలంలోని కొండూరుపాళెం నుంచి కూటమి నాయకులతో కలసి సముద్రంలోని ముఖద్వారాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అతిదిగ్గరలో ఆయన మాట్లాడుతూ... వాకాడు మండలంలోని మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలిసి కల్పిస్తామన్నారు. ఇప్పటికే పూడిపోయినందు వల్ల సముద్ర ముఖద్వారానికి అనుమతులు వచ్చాయన్నారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం, శ్రీనివాసపత్రం తదితర గ్రామాల్లో ఉన్న మత్స్యకారుల అభివృద్ధి కోసం కొండూరుపాళెంలో సహజసిద్ధంగా ఉన్న రెండో ముఖద్వారాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. తీరప్రాంత గ్రామాల్లో ఆటవీ అంశాలతో ఆగిపోయిన పనులను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. డి. మధుసూదన్‌రెడ్డి, వెన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, చిట్టమూరు మాజీ జడ్పీటీసీ వంకా రమణయ్య, బీజేపీ కౌన్సిల్ సభ్యులు పి.కృష్ణయ్య, రవినాయుడు, కె.సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి కటాక్షంతోనే రాజకీయంగా ఎదిగా

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి


దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆనం

దక్కిలి, జూన్ 17 : పెంచలక్ష్మి, ఆదిలక్ష్మి సమేత నృసింహస్వామి కటాక్షంతోనే తమ కుటుంబానికి రాజకీయంగా నాలుగు దశాబ్దాలపాటు అనేక పదవులు వరించాయని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం పెంచలకోనలో కొలువై ఉన్న నృసింహస్వామిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఏసీ సాగర్ బాబు ప్రభుత్వ లాంఛనాలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామిఅమ్మవార్ల సేవలో పాల్గొనగా అర్చకులు గోత్రనామాలతో పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ... స్వామిఅమ్మవార్లను వేడుకుంటే వారి ఆశీస్సులతో అనుకున్న కోర్కెలు నెరవేరతాయని చెప్పడానికి తన జీవితమే నిదర్శనమన్నారు. చంద్రబాబు లాంటి పెద్దల సాంగత్యం, సహచర ఎమ్మెల్యేల పరిచయాలతోనే తాను మళ్లీ మంత్రిగా ఇక్కడికి వచ్చానన్నారు. స్వామిఅమ్మవార్ల పూజలకే అంకితమయ్యే దేవదాయ శాఖ ద్వారా సమాజంలో అనేక వర్గాల ప్రజలకు ఊరట కలిగించడమే తన కర్తవ్యమన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు ఆయనతో పాటు రాజకీయాల్లో అడుగుపెట్టిన తాను ఆ స్ఫూర్తితో దేవదేవుడి ఆశీస్సులతో రాజకీయంగా ఇంతటి స్థాయికి చేరుకున్నానన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో త్వరలో శాసనసభ సమావేశాలు ముగిశాక అధికారికంగా నియోజకవర్గంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. తన సోదరుడు కురుగొండ్ల రామకృష్ణ తో తాను ఈ నియోజకవర్గంలో కలిసి మెలిసి పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్ను బాస్కర్‌రెడ్డి, డి.వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురామిరెడ్డి, పి.కోటేశ్వర్‌రెడ్డి, పి.చంద్రమౌళిరెడ్డి, ఏఎంసీ, రంగినేని రాజా, సోమయ్య, బి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


గరుడ పటానికి పూజలు చేస్తున్న అర్చకులు

గూడూరు, జూన్ 17: స్థానిక రాజావీధిలో కొలువై ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17న సోమవారం స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ధ్వజస్తంభానికి పూజలు నిర్వహించి గరుడ పటాన్ని ఎగుర వేసి ఉత్సవాలకు నాంది పలికారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

త్రిదండి చిన్నజీయర్ స్వామి



నాయుడుపేట టౌన్, జూన్ 17: విజ్ఞానం లేని చదువు వనికిరాదని... విలువలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరు అభ్యసించాలని త్రిదండి శ్రీమన్నారాయణ జీయర్ అన్నారు. పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న అమరనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం చిన్నజీయర్‌స్వామి భక్తులను అనుగ్రహించారు. మానవసేవే మాధవసేవ అన్న విధంగా ప్రతి జీవికి చేతనైన సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామసుందర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, కట్టా సురేశ్‌రెడ్డి, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి వర్షం

వెంకటగిరిటౌన్, జూన్ 17: గత మూడు రోజులుగా భానుడు ప్రతాపం చూపించాడు. సోమవారం మధ్యాహ్నం నుంచి పట్టణంలో తేలికపాటి వర్షం పడడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. అరుతడి పంటకు నీరు లేకపోవడంతో ఈ వర్షంతో రైతులు ఊరట చెందారు.

మంత్రి ఆనంకు పేట నాయకుల సన్మానం



నాయుడుపేట, జూన్ 17: దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సోమవారం తిరుపతి పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి దార్ల రాజేంద్ర సన్మానించారు. దేవాలయాల పురాతన దేవా లయాలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా పునరుద్ధరించాలని కోరారు. అయ్యప్ప, పవన్‌కుమార్, సుకుమార్, వినోద్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి


హాకీ స్టిక్, సర్టిఫికెట్లను అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, జూన్ 17: క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని విద్యార్థులు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి పాశం సంధ్యారాణి అన్నారు. సోమవారం ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో విద్యార్థులకు చెందిన శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన హాకీ వేసవి శిక్షణ ఉచిత శిబిరం ముగింపు సందర్భంగా ఆమె హాకీ స్టిక్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు దేశస్థాయిలో రాణించి గూడూరుకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కోచ్ దీపక్‌కుమార్, అబ్రహం, చంద్రశేఖర్, టీఆర్.మణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి ఘన సత్కారం



పెళ్లకూరు, జూన్ 17: ఎమ్మెల్యే విజయశ్రీని వెయ్యి 5 రూపాయల నాణేల మాలతో పేరం సోదరులు సత్కరించారు. సోమవారం నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతోపాటు ఎమ్మెల్యే విజయశ్రీని పూల మాలలు, శాలువాలతో పెళ్లకూరు టీడీపీ నాయకులు పేరం రమేష్‌నాయుడు మధుసూదన్‌నాయుడు, చంద్రబాబునాయుడు, ప్రచార భారతీయుడు పేరం వెంకటేశ్వర్లునాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి. మురళీకృష్ణారెడ్డి, కొగిలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక



శ్రీకాళహస్తి, జూన్ 17: శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగు గంగ కాలనీ అతిథి గృహంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రంగని దేవానంద్, ప్రధాన కార్య దర్శిగా సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రెడ్డివాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మహిళా విభాగం అధ్యక్షురాలిగా మంజు, కార్యదర్శిగా భారతి, ఆర్థిక కార్య దర్శిగా ఇందిరను ఎన్నుకున్నారు. యువకిశోర్, ఎస్.బాషా, చెంగల్రాయులు, వెంకటయ్య, బాలచందర్, లక్ష్మీపతి, విశ్వనాథ్, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం

రెండు నెలల కాపురం తర్వాత పరార్ ● తెలంగాణ యువకుడిపై యువతి ఫిర్యాదు

గద్వాల క్రైం, జూన్ 17: ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ప్రేమకు, ఆపై సహ జీవనానికి దారితీసింది. రెండు నెలలు కాపురం చేశాక మళ్లీ వస్తానంటూ వెళ్లిన ఆ యువకుడు తిరిగి రాలేదు. ఆతడిని వెతుక్కుంటూ తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడుకు వెళ్లిన విద్యానగర్ యువతి ఉదంతమిది. సోమవారం గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు ఆమె అందజేసిన ఫిర్యాదు మేరకు వివరాలివీ. కోట మండలం, విద్యానగర్‌కు చెందిన నిహారికకు మానవపాడు మండలం ఏ.బూరెపాడుకు చెందిన బషీర్ అనే యువకుడితో ఏడాది క్రితం ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి కొద్దిరోజులు ఇద్దరూ సహజీవనం చేశారు. తనకు ఇంతకుముందే వివాహమై విడాకులయ్యాయని, ఇద్దరు సంతానం అని చెప్పినా కూడా బషీర్ ఎలాంటి ఇబ్బంది లేదన్నాడని నిహారిక తెలిపింది. ఈ ఏడాది మార్చి 18న ఆయన హిందూ సంప్రదాయం ప్రకారం తాళి కట్టాడు. కొద్దిరోజులు ఇద్దరూ కాపురం చేశారు. తర్వాత తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని ఉన్న మౌలాలీ ఫోన్ చేశాడని, వెళ్లి చూసి వస్తానని బషీర్ సొంతూరికి వెళ్లాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా అందుబాటులోకి రాకపోవడంతో విచారణ నిహారిక తన భర్త ఊరికి వచ్చి గత నెల 25న శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే ఎస్ఐ సంతోష్ అన్యాయంగా మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమెను స్టేషన్‌లోనే ఉంచి భయభ్రాంతులకు గురిచేశాడు. సోమవారం బక్రీద్ పండుగ కనుక భర్త ఇంటికి వస్తాడని భావించి బాడిదపాడుకు వెళ్లగా బషీర్ అన్యాయంగా దూషిస్తూ దాడి చేశాడు. ఈ విషయాన్ని ఎస్ఐకి వివరించగా పట్టించుకోలేదు. దీంతో ఎస్ఐ సంతోష్‌పై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని డీఎస్పీ సత్యనారాయణకు సోమవారం నిహారిక ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా నిహారిక ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, అయితే కేసు పెట్టడం లేదని, ఇద్దరినీ కూర్చోబెట్టి రాజీకి రావాలని, లేదా పరిహారం ఇప్పించేలా చూడాలని చెప్పడం జరిగిందని తమ డ్యూటీ కూడా పోలీస్‌స్టేషన్ బయట చూసుకోవాలని చెప్పినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసే విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.

రెండుపూటలా నీరు సరఫరా చేస్తాం: పాశిం

గూడూరు, జూన్ 17: పట్టణ ప్రజలకు రెండుపూటలా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణానికి తాగునీరందించే వేములపాళెం, విందూరు, మల్లితోట వాటర్ వర్క్స్‌ను, జనార్దన రెడ్డి కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుతం పట్టణానికి కండలేరు జలాశయం నుంచి పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందుతుండడంతో ఉదయం పూట మాత్రమే సరఫరా అవుతోందన్నారు. గతంలో విందూరు వాటర్‌వర్క్స్ నుంచి తాగునీరు సరఫరా అయ్యేదన్నారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మోటర్లు, పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. అలాగే ఆక్కడ ఆక్రమణలను తొలగించి వాటర్‌వర్క్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. పట్టణంలో పలు ఓవర్ హెడ్ ట్యాంకులు కూడా పగుళ్లిచ్చి ఉన్నాయని వాటికీ మరమ్మతులు చేపడుతామన్నారు. అనంతరం టిడ్కో గృహాలను పరిశీలించి నివాసులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గృహ సముదాయానికి వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ రంగులేసింది తప్ప మౌలిక వసతులు కల్పించలేదన్నారు. తన సొంత నిధులతోనైనా బోర్లు వేయించి నీటి సౌకర్యం కల్పిస్తానని చెప్పారు. ఎస్.కిరణ్‌కుమార్, పి.శ్రీనివాసులు, బి.వెంకటరామయ్య, ఏమస్తాన్‌నాయుడు, అబ్దుల్ రహీం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మల్లితోట వాటర్‌వర్క్స్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

త్యాగానికి ప్రతీక బక్రీద్





గూడూరు నమాజ్‌కట్ట వద్ద ముస్లింల ప్రార్థనలు - ముస్లిం మహిళకు మాంసం ప్యాకెట్ అందిస్తున్న గ్రీన్ ఫౌండేషన్ సభ్యులు

గూడూరు/ వెంకటగిరి టౌన్/ బాలాయపల్లి/ వాకాడు/ కోట, జూన్ 17: త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినం నిలుస్తుందని ముస్లిం మతపెద్దలు అన్నారు. గూడూరుపట్టణ పట్టణం సహా చెన్నూరు, విందూరు గ్రామాల్లో నమాజ్‌కట్ట వద్ద, జామియా మసీదు వద్ద, పలు ప్రాంతాలలోని దర్గాల వద్ద ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. వెంకటగిరి పట్టణంలోని జామియా మసీదు, అక్స మసీదు, రహమీ మసీదు, ఉమ్మర్ మసీదు, బిల్లాల్ మసీదుల్లో సోమవారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలాయపల్లి మండలంలోని గొట్టికాడు, జయంపు, మన్నూరు, పల్లిపాడు, ఉట్లపల్లి, నిడిగల్లు ఇంకా పలు గ్రామాల్లోని ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. వాకాడు పట్టణంలోని జామియా మసీదులో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు బక్రీద్ విశిష్టతను బోధించారు. కోట మండలంలోని కోట, విద్యానగర్, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, చిట్టేడు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు బక్రీద్ ప్రత్యేకప్రార్థనలు చేశారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని బదరీనగర్‌లో గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లింలకు మాంసం తదితరాలను సంస్థ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అందజేశారు. అదే విధంగా శ్యామసుందరపురం ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దొరవారిసత్రం మండలంలో బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అలరించిన సప్తగిరి సంగీత సప్తాహం



తిరుపతి (కల్చరల్), జూన్ 17: వేమన విజ్ఞాన కేంద్రంలో పాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరు వీనులకు విందుగా సాగుతోంది. వారం రోజులు నిర్వహించే సంగీతయజ్ఞంలో భాగంగా సోమవారం భగవంతుని నామసంకీర్తనతో వేదిక మారుమోగింది. రోజంతా నిర్విరామంగా జరిగిన కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ కళాకారులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ నామ సంకీర్తనలు, హిందూస్థానీ బాణీలో సత్సాంగ భజనలు, నృత్య సహిత సంప్రదాయ సంకీర్తనలు అలరించాయి. సంగీత కళాకారులు డాక్టర్ జొన్నలగడ్డ ఈశ్వర ప్రసాద్, జొన్నలగడ్డ శ్రీరాం బృందం (హైదరాబాదు), ఆచంట లక్ష్మీనివాస్ బృందం (రాజానగరం), ఎం. పురుషోత్తం బృందం(సూళ్లూరుపేట), నిడదవోలు నారాయణ మూర్తి బృందం(రాజమండ్రి), జ్ఞానమణి బృందం (చెన్నై), కె. లీలా రామానుజన్ బృందం (చెన్నై) తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు హరికథా గానం జరుగుతుందని నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.